# విశాల భారతి

12-04-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 101







## ఫ్యూడల్ శక్తులు ఏకమవుతున్నాయి

- ఫ్యూడల్ శక్తుల నుండి ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి
- విద్యకు బడ్జెట్‌లో 13.5శాతం నిధులు, 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యార్థుల డైట్ చార్జీల పెంపు, స్కూళ్లలో అల్పాహార పథకం
- బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి

03



03

## రూ. 15 వేల కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

- రూ.15 వేల కోట్ల విలువైన 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- కబ్జాదారుడు ముఖీం కట్టిన గెస్ట్ హౌస్, అపార్ట్‌మెంట్ నేలమట్టం
- ఇప్పటికే ఇళ్లు కట్టుకున్న వారికి ఇబ్బంది లేదని అధికారుల హామీ

## నాదర్‌గుల్‌లో తిరగబడ్డ రైతాంగం



- నాదర్‌గుల్ భూముల్లో బౌన్సర్లను రైతులు తరిమికొట్టారు
- పేద రైతుల భూమి కబ్జా చేస్తున్నారని బాధితుల ఆగ్రహం
- పొంగులేటి కుటుంబం భూమిని కబ్జా చేస్తోందని హరీశ్ రావు ఆరోపణ
- గతంలోనే రిజిస్ట్రేషన్లు జరిగాయని మంత్రి పొంగులేటి కౌంటర్
- 373 ఎకరాల భూమి వివాదం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉంది
- రాజకీయ పోరుతో నాదర్‌గుల్‌లో టెన్షన్ కొనసాగుతోంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ సాక్షిగా భూమి క్షేత్రంలో రైతాంగం కన్నెర్ర చేసింది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లోకి ప్రైవేటు సంస్థల బౌన్సర్లు ప్రవేశించడాన్ని నిరసిస్తూ అన్నదాతలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. తమ ప్రాణాలకు తెగించి ప్రైవేటు సైన్యాన్ని పరుగులు పెట్టించిన దృశ్యాలు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. సుమారు 373 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వివాదాస్పద భూమి చుట్టూ ఇప్పుడు రాజకీయ వేడి రాజుకుంది. తమ భూముల్లోకి అక్రమంగా చొరబడి రేకులు పాతి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రెండేళ్లుగా తమను సాగుకు దూరం చేస్తున్నారని

మిగతా 3లో..

## కాళేశ్వరం విచారణకు కేసీఆర్ ?

- కాళేశ్వరం అవినీతిపై సీబీఐ దర్యాప్తుకు సన్నాహాలు
- రాష్ట్ర అధికారులు ఢిల్లీ వెళ్లి సీబీఐకి కావాల్సిన వివరణ
- పీసీ ఘోష్ నివేదికలోని అవినీతి అంశాలపై విచారణ

04





# గులాబీ తోటలో జీవన్ సెగ

### టికెట్ కోసమే జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకనే ఆరోపణ

- కాంగ్రెస్‌లో టికెట్ రాదనే భయంతోనే పార్టీ మార్పు
- ఆయన వల్ల కొత్తగా ఓట్లు పెరగవని బీఆర్ఎస్ భావన
- అంతర్గత విభేదాల తలనొప్పి వదిలిందని కాంగ్రెస్ ఊరట
- బీఆర్ఎస్‌లో ఎల్.రమణతో టికెట్ వార్ తప్పదు
- మళ్లీ సంజయ్ వర్సెస్ జీవన్‌రెడ్డి.. కానీ పార్టీలు మారాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీకి వెన్నుముకగా నిలిచిన సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. కాంగ్రెస్ గూటిని వీడి గులాబీ తీర్థం పుచ్చుకోవడానికి ఆయన సిద్ధమవడంతో తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన జీవన్‌రెడ్డి, ఇప్పుడు పార్టీ మారడం జగిత్యాల నియోజకవర్గ సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తోంది. పార్టీల మధ్య ఈ మార్పు కేవలం ఒక నాయకుడి బదిలీగా కాకుండా, నియోజకవర్గ భవిష్యత్తును నిర్ణయించే పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. హస్తం పార్టీకి ఆయన దూరం కావడం ఆ పార్టీకి తలనొప్పిని తగ్గించిందా లేక బలహీనపరిచిందా అన్న కోణంలో చర్చ సాగుతుండగా, బీఆర్ఎస్‌కు ఆయన రాక అసలైన బలాన్ని ఇస్తుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. జీవన్‌రెడ్డి తాజా నిర్ణయం వెనుక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉందన్నది జగిత్యాల ప్రజల సామాన్య అభిప్రాయం.

మిగతా 3లో..






# కాజూ పకోడి అవుతున్న యాదాద్రి ప్రసాదం

- ప్రసాదం కోసం వాడే జీడిపప్పు, బాదం, నెయ్యి అక్రమంగా తరలింపు
- రిజిస్టర్‌కు, స్టాక్‌కు మధ్య పొంతన లేకపోవడంతో స్కామ్ బట్టబయలు
- సరుకులు దొంగిలిస్తూ, పకోడీలు తింటూ పట్టుబడ్డ సిబ్బంది
- నిఘా ఉన్నా పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా అక్రమాలు
- ఉన్నతాధికారుల అండతోనే ఈ దొంగతనాలు జరుగుతున్నాయని ఆరోపణలు
- గతంలోనూ ఇలాంటివి జరిగినా శిక్షలు లేకపోవడంతో ఆగని దోపిడీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో అత్యంత ప్రసిద్ధి గాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రసాదాల తయారీ, ముడి సరుకుల పంపిణీ వ్యవహారం ఇప్పుడు పెను వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించే జీడిపప్పు, బాదం, నెయ్యి వంటి విలువైన సరుకులు నైవేద్యంగా మారకుండానే అక్రమార్కుల జేబుల్లోకి చేరుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఆలయ ప్రసాదాల తయారీ కేంద్రంలో జరుగుతున్న పరిణామాలు భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తున్నాయి. స్వామివారికి నివేదించాల్సిన ఉత్తమ శ్రేణి సరుకులు దొడ్డిదారిలో బయటకు తరలిపోతుంటే, నిఘా ఉంచాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమాల వెనుక ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ పనిచేస్తోందనే అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి. యాదాద్రి ఆలయంలో లడ్డూ, పులిహోర వంటి ప్రసాదాల తయారీ కోసం ఏటా కోట్ల రూపాయల విలువైన ముడి సరుకులను దేవస్థానం కొనుగోలు చేస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం ప్రతి నెలా సుమారు 1,500 నుంచి 2,000 కిలోల వరకు జీడిపప్పు, 800 కిలోల బాదం పప్పు, వేల లీటర్ల స్వచ్ఛమైన నెయ్యిని వినియోగించాల్సి ఉంటుంది. అయితే, కాగితాల్లో కనిపిస్తున్న ఈ గణాంకాలకు, వాస్తవంగా తయారవుతున్న ప్రసాదాల నాణ్యతకు పొంతన ఉండటం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రికార్డుల్లో వంద శాతం సరుకులు వాడినట్లు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో అందులో 20 నుంచి 30 శాతం మేర కోత విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యత్యాసం వల్ల ప్రతి నెలా లక్షలాది రూపాయల విలువైన దేవస్థాన సంపద అక్రమార్కుల పాలవుతోందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రసాదాల తయారీ కేంద్రంలో నిల్వల లెక్కలు, రికార్డుల మధ్య భారీ వ్యత్యాసం ఉండటమే ఈ స్కామ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. సరుకులు గోదాము నుంచి పోటుకు చేరే క్రమంలోనే పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని సమాచారం. ముఖ్యంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండగా, కొంతమంది అధికారులు వారిని అడ్డుకోకుండా మౌనం వహించడం ఈ దోపిడీకి మరింత ఊతమిస్తోంది. విలువైన సరుకులను ప్యాకెట్లలో నింపి గుట్టుచప్పుడు కాకుండా బయటకు తరలిస్తున్న దృశ్యాలు తాజాగా వెలుగులోకి రావడం సంచలనం సృష్టించింది. గతంలో కేవలం చింతపండు బస్తాలకే పరిమితమైన ఈ దొంగతనాలు, ఇప్పుడు ఖరీదైన డ్రై ఫ్రూట్స్ వరకు పాకడం అధికారుల వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. తాజాగా జరిగిన ఒక ఘటనలో ప్రసాదాల తయారీ కోసం ఉంచిన బాదం, జీడిపప్పుతో సిబ్బంది పకోడీలు తయారు చేసుకుని



అక్కడికక్కడే విందు ఆరగించడం అత్యంత విచారకరం. భక్తులు పవిత్రంగా భావించే వస్తువులను వ్యక్తిగత ఆహారం కోసం వాడుకోవడం ఆలయ నిబంధనలకు విరుద్ధం. ఇలా అడ్డంగా దొరికిపోయిన సిబ్బందిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించినప్పుడు సరైన సమాధానం లేకపోవడం గమనార్హం. కేవలం తినడమే కాకుండా, మిగిలిన సరుకులను సంచుల్లో నింపుకుని ఇళ్లకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా పట్టుబడటం ఈ అక్రమాల తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలాంటి సంఘటనలు నిరంతరం జరుగుతున్నా, పర్యవేక్షణ లోపించడం వల్ల అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. దేవస్థాన గోదాములు ప్రస్తుతం అక్రమాలకు నిలయాలుగా మారాయని భక్తులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యం, నూనె, చక్కెర వంటి నిత్యావసరాలు గోదాముకు చేరినప్పటి నుంచే లెక్కల్లో మాయమవుతున్నాయి. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా తనిఖీ చేయాల్సిన ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహించడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. వాస్తవ నిల్వలకు, కాగితాల్లో ఉన్న గణాంకాలకు మధ్య కనీసం 15 శాతం తేడా ఉన్నట్లు అంతర్గత విచారణలో వెల్లడైనట్లు సమాచారం. గోదాము వద్ద నిరంతరం నిఘా ఉండాల్సి ఉన్నా, అక్కడ పనిచేసే సిబ్బంది కుమ్మక్కు కావడంతో స్వామివారి సొమ్ము దారితప్పుతోంది. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయనే అనుమానాలు కూడా బలంగా వ్యక్తమవుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టాత్మకమైన సెక్యూరిటీ వ్యవస్థ ఉన్నప్పటికీ, ఈ దొంగతనాలను అరికట్టలేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గోదాములు, ప్రసాదాల తయారీ కేంద్రాల వద్ద అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా, వాటి ఫుటేజీని నిరంతరం సమీక్షించే పటిష్టమైన వ్యవస్థ లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. ఏదైనా పెద్ద ఘటన జరిగినప్పుడు మాత్రమే ఫుటేజీని చూడటం వల్ల అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. భద్రతా సిబ్బంది తనిఖీల్లో సైతం పక్షపాతం కనిపిస్తోందని, తనిఖీల పేరుతో కేవలం సామాన్య భక్తులను మాత్రమే ఇబ్బంది పెడుతున్నారని, లోపల జరిగే భారీ అక్రమాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో చింతపండు మాయమైన ఘటనలో కొందరిపై చర్యలు తీసుకున్నప్పటికీ, అవి నామమాత్రంగానే మిగిలిపోయాయి. కఠినమైన శిక్షలు లేకపోవడంతో సిబ్బందిలో భయం తగ్గిపోయింది. కేవలం సస్పెన్షన్లతో సరిపెట్టకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఒకసారి దొరికిపోయిన సిబ్బందిని మళ్లీ విధుల్లోకి తీసుకోవడం వల్ల వారు మరింత ధీమాగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ఉన్న వారే భక్షణకు దిగడం దురదృష్టకరం. ఇలాంటి పరిణామాలు భవిష్యత్తులో భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రసాదాల నాణ్యత విషయంలో కూడా ఫిర్యాదులు పెరుగుతున్నాయి. లడ్డూల్లో వేయాల్సిన పరిమాణంలో జీడిపప్పు, కిస్మిస్ ఉండటం లేదని, నెయ్యి వాసనలో తేడాలు వస్తున్నాయని భక్తులు చెబుతున్నారు. సరుకులు మాయమవ్వడం వల్లే ప్రసాదం నాణ్యత పడిపోతోందని స్పష్టమవుతోంది. లడ్డూల బరువులో సైతం వ్యత్యాసాలు వస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. నిర్ణీత బరువు కంటే తక్కువగా ఉండటం వల్ల భక్తులు చెల్లించే సొమ్ముకు తగిన ప్రసాదం లభించడం లేదు. దీనివల్ల దేవస్థానానికి ఆదాయం రావడమే కాకుండా, అక్రమార్కుల జేబులు మాత్రం నిండుతున్నాయి. ఈ అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని విపక్షాలు, భక్తుల సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. దేవాదాయ శాఖ తరపున ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేసి, గత ఆరు నెలల కొనుగోళ్లు, వినియోగంపై ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల బాధ్యతను కూడా సమీక్షించాల్సిన అవసరం ఉంది. దేవస్థానంలో పనిచేసే ప్రతి ఉద్యోగి జవాబుదారీతనంతో వ్యవహరించేలా కఠిన నిబంధనలు తీసుకురావాలి. ముడి సరుకుల సరఫరా నుంచి ప్రసాదం పంపిణీ వరకు డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షణ చేపడితే తప్ప ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. యాదాద్రి పునర్నిర్మాణం తర్వాత భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. సగటున రోజుకు 20 వేల నుంచి 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. సెలవు రోజుల్లో ఈ సంఖ్య 60 వేల వరకు ఉంటోంది. ఇంత పెద్ద ఎత్తున భక్తులు వస్తున్న సమయంలో ప్రసాదాల కొరత రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ, ఒకవైపు సరుకులు మాయమవుతుంటే మరోవైపు భక్తులకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పడం లేదు. కౌంటర్ల వద్ద ప్రసాదం అయిపోయిందని చెప్పే సందర్భాల్లో, లోపల సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే వార్తలు భక్తులను మరింత కుంగదీస్తున్నాయి.

# అవినీతి అంటే చెప్పు తెగుతది

- అవినీతి ప్రచారంపై చెప్పు తెగుతుందంటూ మంత్రి ఘాటు వ్యాఖ్యలు
- ఫోన్లను రూ.11,650కే కొన్నామని, రూ.14 వేలన్నది అబద్ధమని వెల్లడి
- మేడారం పనులపై సీబీఐ విచారణకైనా సిద్ధమని ప్రకటన
- 5జీ పేరుతో 4జీ ఫోన్లిచ్చి అవినీతి చేశారని క్రిశాంక్ ఆరోపణ
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఫోన్ల కొనుగోలు వ్యవహారం రచ్చ
- కాంగ్రెస్ ఓర్వలేకనే బురద జల్లుతున్నారని సీతక్క మండిపాటు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చేందుకు ప్రతిపక్షాలు పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నాయని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ములుగు వేదికగా జరిగిన పార్టీ అంతర్గత సమావేశంలో ఆమె మాట్లాడుతూ, నిరాధారమైన ఆరోపణలు చేసే వారిపై కఠిన పదజాలంతో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తమ ప్రభుత్వంపై అవినీతి ముద్ర వేయాలని చూడటం సరికాదని హితవు పలికారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, ఇలాంటి చిల్లర రాజకీయాలకు తాము భయపడబోమని ఆమె స్పష్టం చేశారు. అంగన్‌వాడీ టీచర్ల కోసం కొనుగోలు చేసిన సెల్‌ఫోన్ల ధరల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి గణాంకాలతో సహా వివరించారు. ప్రభుత్వం ఒక్కో స్మార్ట్‌ఫోన్‌ను కేవలం 11,650 రూపాయలకే సేకరించిందని, అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా ఆ ధరను 14,000 రూపాయలుగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియ మొత్తం అత్యంత పారదర్శక నిబంధనల నడుమ జరిగిందని, ఇందులో పైసా అవినీతికి కూడా తావు లేదని భరోసా ఇచ్చారు. ఆధారాలు లేకుండా తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా మాట్లాడితే సహించేది లేదని, అబద్ధాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సంచలనం సృష్టించిన మేడారం జాతర నిధుల వినియోగంపై వస్తున్న విమర్శలకు కూడా మంత్రి సీతక్క అదే స్థాయిలో బదులిచ్చారు. జాతర పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న వారు ఏ విచారణకైనా సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ జరిపించుకోవచ్చని, నిజాయితీగా ఉన్న తమకు భయం లేదని ప్రకటించారు. మేడారం వంటి పవిత్రమైన పుణ్యక్షేత్రం విషయంలో కూడా రాజకీయం చేయడం ప్రతిపక్షాల దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో జరిగిన అభివృద్ధిని కళ్లతో చూడలేని వారే ఇలాంటి అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు చేరువవుతుండటాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. గత పదేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు కొత్త ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తనను రకరకాల ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారని, కానీ తాము ఆశలకు లొంగలేదని గుర్తుచేశారు. గడచిన ఎన్నికల్లో తనను ఓడించడానికి ప్రత్యర్థులు వందల కోట్ల రూపాయలు నీళ్లలా ఖర్చు చేశారని, కానీ ములుగు ప్రజలు తన నిజాయితీని గుర్తించి భారీ మెజారిటీతో గెలిపించారని ఆమె ఉద్వేగంగా మాట్లాడారు. మరోవైపు బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఈ వ్యవహారంలో గణాంకాలను బయటపెడుతూ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వ 'పోషణ్ అభియాన్' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 38,130 స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇందుకోసం సుమారు 54.19 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచారని ఆయన పేర్కొన్నారు. అయితే టెండర్ నిబంధనల్లో 5జీ ఫోన్లు అని పేర్కొన్నప్పటికీ, వాస్తవానికి 4జీ మోడల్ అయిన శాంసంగ్ ఏ06 ఫోన్లను సరఫరా చేశారని ఆరోపించారు. ఈ ఫోన్ల అసలు విలువకు, ప్రభుత్వం చెల్లిస్తున్న మొత్తానికి మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ప్రభుత్వం ఒక్కో ఫోన్‌కు 14,215 రూపాయలు చెల్లించేలా ఒప్పందం చేసుకుందని, కానీ బహిరంగ మార్కెట్లో ఆ ఫోన్ ధర చాలా తక్కువగా ఉందని క్రిశాంక్ వాదించారు. ఈ మొత్తం కొనుగోలు విలువ వాస్తవానికి 24 కోట్ల రూపాయల లోపే ఉండాల్సి ఉండగా, అదనంగా నిధులను కేటాయించి సుమారు 30 కోట్ల రూపాయల మేర భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. 4జీ ఫోన్లను 5జీ ధరలకు కొనుగోలు చేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వివాదం ఇప్పుడు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా రాజకీయ యుద్ధంగా మారింది. మంత్రి సీతక్క మాత్రం తన శాఖలో అక్రమాలకు తావు లేదని, టెండర్ ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని గట్టిగా చెబుతున్నారు. ప్రతిపక్షాలు కావాలనే సాంకేతిక అంశాలను వక్రీకరించి ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆమె ఆరోపిస్తున్నారు. ఒక ఆదివాసీ మహిళ మంత్రిగా ఉన్నత స్థానంలో ఉండి సమర్థవంతంగా పనిచేయడం కొందరికి ఇష్టం లేదని, అందుకే తనను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన రాజకీయ జీవితం ఒక తెరిచిన పుస్తకమని ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు డిజిటల్ విధానం ఎంతో అవసరమని, అందుకే ఈ స్మార్ట్‌ఫోన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని అధికారులు వివరిస్తున్నారు. అత్యాధునిక ఫీచర్లు ఉన్న ఫోన్లనే ఎంపిక చేశామని, వీటి ద్వారా డేటా సేకరణ సులభతరం అవుతుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం ఫోన్ల నాణ్యత, ధరల విషయంలో పదే పదే ప్రశ్నలు సంధిస్తున్నాయి. టెండర్ డాక్యుమెంట్లలో ఉన్న అంశాలకు, క్షేత్రస్థాయిలో పంపిణీ చేస్తున్న ఫోన్లకు పొంతన లేదని వారు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కూడా ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ రాజకీయ పోరాటాన్ని ఆసక్తిగా గమనిస్తున్నారు. తమకు అందే ఫోన్లు తమ విధులకు ఎలా ఉపయోగపడతాయన్న దానికంటే, ఇప్పుడు వాటి చుట్టూ అల్లుకున్న అవినీతి ఆరోపణలే చర్చనీయాంశంగా మారాయి. ములుగు జిల్లాలో మంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టే క్రమంలో ఆమె వాడిన భాషపై కూడా మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు హుందాతనాన్ని పాటించాలని కొందరు అంటుండగా, అసత్య ప్రచారాలను ధీటుగా ఎదుర్కోవడంలో తప్పులేదని మరికొందరు సమర్థిస్తున్నారు.

# ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

**నిజామాబాద్, విశాలభారతి:**



మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దుబ్బ లోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో పూలే జయంతి వేడుక నిర్వహించారు. అంతకుముందు వినాయకనగర్ లోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, బీసీ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను పారద్రోలేందుకు మహాత్మ జ్యోతిబాపూలే కొనసాగించిన కృషి అమోఘమని అన్నారు. అడుగడుగునా అవరోధాలు, అవమానాలు ఎదురైనప్పటికీ ఏమాత్రం చలించకుండా సాంఘిక దురాచారాలను దూరం చేసేందుకు పూలే ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. అణగారిన వర్గాలు సమానత్వం సాధించాలంటే విద్య ఎంతో అవసరమని గుర్తించి వారికి విద్య అందేలా విశేషంగా కృషి చేశారని, మహిళల విద్య కోసం ప్రత్యేకంగా మొట్టమొదటి పాఠశాలను స్థాపించారని అన్నారు. ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ప్రభుత్వం బీ.సీ గురుకులాలకు జ్యోతిబాపూలే పాఠశాలలుగా నామకరణం చేస్తూ నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మహనీయులు చూపిన బాటలో పయనిస్తూ వారి ఆశయాల సాధన కోసం కృషి చేసినప్పుడే మన జీవితానికి కూడా సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల బాధ్యులు బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్, నరేందర్ గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ చుట్టూ భూ దోపిడీ



- రేవంత్ రెడ్డి అధికారం అండతో భూముల దందా
- బీఆర్ఎస్ విజయం న్యాయం సాధించిన గెలుపు
- ఫార్మా సిటీ భూములపై మాట తప్పి రైతులను మోసం
- నిషేధిత భూముల పేరుతో ప్రభుత్వం సెటిల్మెంట్లు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అరాచకాలు, వసూళ్లు
- అక్రమాలకు సహకరించే అధికారులను వదిలిపెట్టే లేదు


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న విధానాలు రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. పేద ప్రజల భూములను అక్రమంగా గుంజుకుంటూ, కేవలం తన కుటుంబ సభ్యులు, అనుచరుల ఆర్థిక ప్రయోజనాలే పరమావధిగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం శాశ్వతమని భావిస్తూ అహంకారంతో వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి తెలంగాణ సమాజం త్వరలోనే తగిన బుద్ధి చెబుతుందని, పదవి నుంచి దిగిపోయిన తర్వాత ఆయనను కనీసం పలకరించే నాథుడు కూడా ఉండడని కేటీఆర్ జోస్యం చెప్పారు. అప్రజాస్వామిక పద్ధతులతో పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి, తెలంగాణ చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతారని విమర్శించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ గెలుపును ప్రస్తావిస్తూ, అక్రమాలకు పాల్పడినా అంతిమంగా న్యాయమే గెలిచిందని కేటీఆర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం గత రెండు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అరాచకాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో మెజారిటీ కౌన్సిలర్లు గులాబీ పార్టీకి చెందిన వారే ఉన్నప్పటికీ, ఫోర్జరీ రాజకీయాలతో చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నించిందని పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా అక్కడ బీఆర్ఎస్ జెండా ఎగరడం రేవంత్ రెడ్డి నైతిక ఓటమికి నిదర్శనమని అభివర్ణించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించిన ప్రభుత్వానికి అక్కడి కౌన్సిలర్లు, కార్యకర్తలు గట్టిగా ఎదురు నిలిచి విజయం సాధించడం అభినందనీయమని కొనియాడారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. మున్సిపల్ ఎన్నికల్లో వీరోచితంగా పోరాడి గెలిచిన చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లను ఆయన ఘనంగా సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే అరాచకాలను, బెదిరింపులను తట్టుకొని పార్టీని బలోపేతం చేసిన యువ నాయకుడు ప్రశాంత్ రెడ్డి నాయకత్వ పటిమను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి కుమారుడైన ప్రశాంత్, మొండితనంతో కూడిన కార్యదక్షతను ప్రదర్శించారని, ఇలాంటి నాయకత్వం ఉంటే ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తారని భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ చేస్తున్న దౌర్జన్యాలను ఎదుర్కోవడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఫార్మా సిటీ భూముల విషయంలో కాంగ్రెస్ సర్కార్ ఆడుతున్న నాటకాలను కేటీఆర్ ఎండగట్టారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం సేకరించిన 14,000 ఎకరాల భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికి ఓట్లు దండుకున్నారని విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక, అదే భూముల్లో 'ఫోర్త్ సిటీ' పేరిట కొత్త డ్రామాకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్క, ప్రస్తుతం మంత్రులుగా ఉన్న సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి నాయకులు పాదయాత్రలు చేసి రైతులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఫార్మా సిటీ భూములపై కోర్టులో వివాదాలు నడుస్తుండగానే, అదనంగా మరో 16,000 ఎకరాలను సేకరిస్తామని చెప్పడం భూదందాలో భాగమేనని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ మండిపడ్డారు. ఉన్న నగరాన్ని పట్టించుకోకుండా, కనీసం దోమల బెడదను నివారించలేని స్థితిలో ఉండి 'ఫ్యూచర్ సిటీ' గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రాజకీయ భవిష్యత్తు లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ నిర్మిస్తానంటే ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోహెడ ప్రాంతంలో 178 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఆసియాలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను అమ్మేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. మార్కెట్‌ను రాచకొండ గుట్టలకో లేదా ఫిలిం సిటీ అవతలికో తరలించి, విలువైన కోహెడ భూములను రియల్ ఎస్టేట్ మాఫియాకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రెవెన్యూ యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని భూముల సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. గతంలో నిషేధిత భూముల జాబితాను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ సంఖ్యను భారీగా పెంచిందని పేర్కొన్నారు. గతంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత భూముల పరిధిని ఏకంగా 1,00,00,000 ఎకరాలకు పెంచి, రైతులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. ఈ నిషేధిత జాబితాను అడ్డం పెట్టుకొని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రభుత్వ పెద్దలు జిల్లా కలెక్టర్లకు ఫోన్లు చేస్తూ సెటిల్‌మెంట్లు సాగిస్తున్నారని ఆరోపించారు. సామాన్య ప్రజలు తమ భూముల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, ప్రభుత్వ పెద్దలు మాత్రం భూదందాతో కోట్లు గడిస్తున్నారని నిప్పులు చెరిగారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే సాగిస్తున్న వసూళ్ల పర్వంపై కేటీఆర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని హోటళ్లు, బార్లు, క్రషర్ల నుంచి నెలవారీగా ఇంత మొత్తం చెల్లించాలని రేటు నిర్ణయించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. స్థానిక వ్యాపారులను, పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ సాగిస్తున్న ఈ అరాచక పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, అక్రమ కేసులు పెట్టి వేధించినా వెనక్కి తగ్గకుండా పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. రేవంత్ రెడ్డి అరాచక శక్తిని ఎదుర్కోవడంలో కార్యకర్తలు చూపిస్తున్న తెగువ పార్టీకి కొండంత బలాన్ని ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. అధికారుల తీరుపై కేటీఆర్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారుల జాబితా తమ వద్ద సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. "ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు, మరో రెండున్నర సంవత్సరాల తర్వాత వచ్చేది మన ప్రభుత్వమే" అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని, వారందరికీ తగిన శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజ్యాంగబద్ధంగా, ప్రజల కోసం పనిచేయాలని, రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హితవు పలికారు. చట్టాన్ని అతిక్రమించే ప్రతి అధికారి చర్యలను పార్టీ గమనిస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి ఉన్న గడ్డుకాలం తొలగిపోయిందని, త్వరలోనే సువర్ణ అధ్యాయం మొదలవుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ఎండగట్టడంలో వెనకాడకూడదని, ప్రజల పక్షాన పోరాడేందుకు పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యంగా భూముల వ్యవహారంలో జరుగుతున్న మోసాలను గ్రామస్థాయిలో చర్చకు పెట్టాలని కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న వాగ్దాన భంగాలను ఎండగట్టడమే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని కేటీఆర్ విశ్లేషించారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ నుంచి, మహిళలకు ప్రకటించిన పథకాల వరకు ప్రతి విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పాలన వదిలేసి కేవలం ప్రతిపక్షాలపై దాడులు చేయడం, భూముల దందాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, ఇలాంటి అప్రజాస్వామిక పాలనను ఎక్కువ కాలం భరించరని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని ప్రజలు బహిష్కరించే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయని ఆయన జోస్యం చెప్పారు.

# గులాబీ తోటలో జీవన్ సెగ

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ పార్టీలో గత కొన్నేళ్లుగా సాగుతున్న అంతర్గత విభేదాలు, ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ఆయన్ను తీవ్ర అసహనానికి గురిచేశాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన డాక్టర్ సంజయ్‌కు ప్రాధాన్యత పెరగడం, తద్వారా తన ఉనికికి ప్రమాదం ఏర్పడిందన్న భావన జీవన్‌రెడ్డిని ఈ కఠిన నిర్ణయం వైపు నడిపించింది. మరోవైపు, కాంగ్రెస్ అధిష్ఠానం వచ్చే ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే విషయంలో కఠినంగా వ్యవహరించే సూచనలు కనిపిస్తున్నాయి. 2023 ఎన్నికల్లో సుమారు 15,000 పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమిని చవిచూసిన జీవన్‌రెడ్డికి, మళ్లీ అదే పార్టీ నుంచి టికెట్ దక్కడం కష్టమని భావించి ఆయన సురక్షితమైన దారిని వెతుక్కుంటున్నారని స్థానిక శ్రేణులు చెబుతున్నాయి. ఈ పరిణామం గతంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఉదంతాన్ని తలపిస్తోంది. అప్పట్లో పొన్నాల రాకతో జనగామ రాజకీయాల్లో భారీ మార్పులు వస్తాయని భావించినా, క్షేత్రస్థాయిలో గులాబీ పార్టీకి ఆశించిన స్థాయిలో అదనపు ఓటు బ్యాంకు జమ కాలేదు. జనగామలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి, కాంగ్రెస్ అభ్యర్థికి మధ్య ఓట్ల తేడా కేవలం 15,500 లోపే ఉండటం గమనార్హం. ఇప్పుడు జీవన్‌రెడ్డి విషయంలోనూ అదే పునరావృతమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారీ క్యాడర్ ఉన్న నేత అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ మార్పు ప్రజల్లోకి ఎలా వెళ్తుందనేది సందిగ్ధంగా మారింది. గత ఎన్నికల్లో 45 శాతానికి పైగా ఓట్లు సాధించిన బీఆర్ఎస్ బలం ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ వర్గాలు మాత్రం జీవన్‌రెడ్డి నిష్క్రమణను ఒక ఊరటగా భావిస్తున్నాయి. గత రెండేళ్లుగా నియోజకవర్గంలో డాక్టర్ సంజయ్ మరియు జీవన్‌రెడ్డి వర్గాల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి పెద్ద సమస్యగా మారింది. పీసీసీ స్థాయి నుంచి మంత్రుల వరకు అనేకసార్లు బుజ్జగించినా ఫలితం లేకపోవడంతో, ఆయన వెళ్లడమే పార్టీ క్రమశిక్షణకు మేలని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో ఉన్నంతకాలం వివాదాలకు కేంద్రబిందువుగా మారిన జీవన్‌రెడ్డి లేకపోవడం వల్ల జగిత్యాలలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడానికి మార్గం సుగమమైందని హస్తం శ్రేణులు విశ్వసిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రజాదరణ క్రమంగా తగ్గుతున్న తరుణంలో, ఆ పార్టీలోకి వెళ్లడం ఆయన రాజకీయ పతనానికి ఆరంభమని కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. నియోజకవర్గ ప్రజల్లో మాత్రం అభ్యర్థులు మారినా పోటీ మాత్రం పాత ముఖాల మధ్యనే ఉండటం విచిత్రంగా అనిపిస్తోంది. పార్టీ జెండాలు మారుతున్నా, ముఖాముఖి పోరు మాత్రం జీవన్‌రెడ్డి మరియు డాక్టర్ సంజయ్ మధ్యనే జరిగేలా కనిపిస్తోంది. ఒకవేళ జీవన్‌రెడ్డికి వయస్సు రీత్యా లేదా ఇతర కారణాలతో బీఆర్ఎస్ టికెట్ నిరాకరిస్తే, ఆయన తన కోడలు చరిష్మారెడ్డిని రంగంలోకి దించే ప్రయత్నం చేయవచ్చు. కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించే వ్యూహంలో భాగంగా ఈ ఎత్తుగడ వేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ అయినా లేదా సామాజిక సమీకరణాలు మారినా, తన పట్టు కోల్పోకుండా ఉండటమే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఇది జగిత్యాల ఓటర్లలో కొత్త చర్చకు దారితీసింది. అయితే బీఆర్ఎస్ పార్టీలో జీవన్‌రెడ్డికి స్వాగతం లభిస్తున్నా, అంతర్గతంగా మాత్రం అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఇప్పటికే ఆ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఉన్న ఎల్.రమణ వర్గం ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఎమ్మెల్సీగా ఉన్న రమణ పదవీకాలం ముగియనుండటంతో, ఆయన కూడా వచ్చే అసెంబ్లీ బరిలో నిలవాలని ఆశిస్తున్నారు. ఇప్పుడు జీవన్‌రెడ్డి రాకతో సీనియర్ల మధ్య ఘర్షణ తప్పదని గులాబీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పదేళ్లుగా పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, కొత్తగా వచ్చిన నాయకుడిని ఏ మేరకు అంగీకరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. జగిత్యాలలో కాంగ్రెస్‌లో ఉన్న పాతకొత్త వివాదం ఇప్పుడు బీఆర్ఎస్‌కు బదిలీ అయినట్లు కనిపిస్తోంది. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనే సామెతను జీవన్‌రెడ్డి నిజం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి కాంగ్రెస్‌తో పెనవేసుకున్న బంధాన్ని తెంచుకోవడం అంటే అది సామాన్యమైన విషయం కాదు. సుదీర్ఘకాలం కేబినెట్ మంత్రిగా, ఎమ్మెల్యేగా సేవలు అందించిన ఆయనకు నియోజకవర్గంలో పటిష్టమైన అనుచర గణం ఉంది. కానీ, ఆ అనుచరులు అందరూ ఆయన వెంటే పార్టీ మారుతారా లేక కాంగ్రెస్ సిద్ధాంతాలకే కట్టుబడి ఉంటారా అన్నది తేలాల్సి ఉంది. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం, ఇప్పుడు జీవన్‌రెడ్డి వ్యక్తిగత ఇమేజ్‌తో తోడైతే ఫలితం ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. గణాంకాలను పరిశీలిస్తే, జగిత్యాల నియోజకవర్గంలో సుమారు 2,20,000 మంది ఓటర్లు ఉన్నారు. గత మూడు ఎన్నికల్లో ఇక్కడ గెలుపు ఓటముల అంతరం కేవలం 10 నుండి 15 శాతం మధ్యనే కొనసాగుతోంది. ఈ స్వల్ప తేడాను భర్తీ చేయడానికి జీవన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఉన్న సుమారు 80,000 స్థిరమైన ఓట్లకు, జీవన్‌రెడ్డి తన సొంత బలంతో మరో 20,000 ఓట్లు చేర్చగలిగితేనే ఆయన గెలుపు సునాయాసం అవుతుంది. లేని పక్షంలో, పార్టీ మారడం వల్ల వచ్చే ప్రతికూల పవనాలు ఆయన రాజకీయ భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టే ప్రమాదం ఉంది. నాయకత్వ మార్పు పట్ల యువతలో ఉన్న వ్యతిరేకత కూడా ఇక్కడ ప్రభావం చూపే అవకాశం ఉంది. జగిత్యాల రాజకీయ యవనికపై ఇప్పుడు పార్టీల కంటే వ్యక్తుల ఆధిపత్యమే ఎక్కువగా కనిపిస్తోంది. ఒకప్పుడు కాంగ్రెస్ అడ్డాగా ఉన్న ఈ ప్రాంతం, ఇప్పుడు త్రిముఖ పోరు వైపు మళ్లుతోంది. జీవన్‌రెడ్డి పార్టీ మారడం వల్ల కాంగ్రెస్ నష్టపోతుందని భావించే వారి కంటే, బీఆర్ఎస్ గందరగోళంలో పడుతుందని భావించే వారే ఎక్కువగా ఉన్నారు. పార్టీలోని పాత కేడర్‌ను సమన్వయం చేయడం జీవన్‌రెడ్డికి పెద్ద సవాలుగా మారనుంది. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల ప్రభావం ఓటర్లపై ఎంతవరకు ఉందనేది కూడా ఆయన విజయావకాశాలను ప్రభావితం చేస్తుంది. నాయకులు మారుతున్నా, జనం సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకునే పరిణామాలు జగిత్యాల ఫలితంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇప్పటికే బీఆర్ఎస్ కీలక నేతలు పార్టీని వీడుతుండటం, అధికార కాంగ్రెస్ బలపడుతుండటం వంటి అంశాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయి.



# నాదర్‌గుల్‌లో తిరగబడ్డ రైతాంగం

**మొదటిపేజీ తరువాయి**



బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన భారీ గేట్లను బద్దలు కొట్టిన రైతులు, కర్రలు పట్టుకుని బౌన్సర్లను తరిమికొట్టడం అక్కడ నెలకొన్న ఉద్రిక్తతకు అద్దం పడుతోంది. ఈ భూవివాదం మూలాలు నిజాం కాలం నాటి రికార్డుల వరకు విస్తరించి ఉన్నాయి. నాదర్‌గుల్‌లోని పాత సర్వే నంబర్ 613, ప్రస్తుత సర్వే నంబర్ 119లో ఉన్న ఈ స్థలం ప్రభుత్వానిదేనని రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గతంలో 2005వ సంవత్సరంలో అప్పటి ఆర్డీఓ సైతం ఇది సర్కారు భూమిగానే నిర్ధారించారు. అయితే, కొందరు వ్యక్తులు తమకు హక్కులు ఉన్నాయంటూ న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం దశాబ్దాలుగా నలుగుతోంది. సుమారు 600 మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు ఈ భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు ఏపీఐఐసీకి కేటాయించిన ఈ భూమిపై హైకోర్టు డివిజన్ బెంచ్ సైతం కీలక తీర్పు ఇచ్చింది. ప్రైవేట్ వ్యక్తులకు జరిగిన అమ్మకాలు చెల్లవని, ఇది సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉండటం సరైనదేనని 2022లో న్యాయస్థానం స్పష్టం చేసినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదు. ప్రస్తుతం ఈ భూమి మార్కెట్ విలువ దాదాపు 7,000 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఇంతటి విలువైన భూమిని కాంగ్రెస్ ప్రభుత్వంలోని కీలక మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన సంస్థలు చేజిక్కించుకోవాలని చూస్తున్నాయనే ఆరోపణలు రాజకీయ దుమారాన్ని రేపాయి. మాజీ మంత్రి హరీష్‌రావు ఈ వ్యవహారంపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. పేద రైతుల నోరు కొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. బలవంతంగా బోర్ బావులను ధ్వంసం చేయడం, ఫెన్సింగ్ వేయడం వంటి చర్యల వెనుక ప్రభుత్వ పెద్దల అండదండలు ఉన్నాయని ఆయన మండిపడ్డారు. పోలీసు బలగాలను అడ్డం పెట్టుకుని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. మరోవైపు ఈ ఆరోపణలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ భూములకు సంబంధించిన కీలక ప్రక్రియలు జరిగాయని ఆయన ఎదురుదాడికి దిగారు. యునైటెడ్ ల్యాండ్ మార్క్స్, ఆల్ఫా ఎస్టేట్స్, ఒమేగా డెవలపర్స్ వంటి సంస్థలకు 2014 సెప్టెంబరు 1న రిజిస్ట్రేషన్లు జరిగాయని, ఆ సమయంలో అధికారంలో ఉన్నది ఎవరు అని ఆయన ప్రశ్నించారు. 2016 సెప్టెంబరు 24న జరిగిన మ్యుటేషన్లకు బాధ్యత ఎవరిదని ఆయన నిలదీశారు. గత పదేళ్ల కాలంలో భూముల దందాలకు పాల్పడిన వారు ఇప్పుడు బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నాదర్‌గుల్ భూములు ఇప్పటికీ నిషేధిత జాబితాలోనే ఉన్నాయని, వాటి రక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. న్యాయపరంగా చూస్తే ఈ వివాదం ప్రస్తుతం దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ప్రైవేట్ పక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో తుది తీర్పు కోసం నిరీక్షణ కొనసాగుతోంది. గత ప్రభుత్వం కోర్టులో సరైన కౌంటర్ దాఖలు చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతే పటిష్టమైన వాదనలు వినిపిస్తున్నామని మంత్రి చెబుతున్నారు. అయితే, కోర్టులో కేసు నడుస్తుండగానే క్షేత్రస్థాయిలో ప్రైవేట్ కంపెనీలు భౌతిక దాడులకు దిగడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భూమిపై యాజమాన్య హక్కులు ఎవరికి ఉన్నాయనే అంశం పక్కన పెడితే, సాగులో ఉన్న రైతులను బౌన్సర్ల ద్వారా వెళ్లగొట్టడం అరాచకత్వానికి నిదర్శనమని పౌర సమాజం భావిస్తోంది. ప్రైవేటు సంస్థలు సైతం తమ వాదనను బలంగా వినిపిస్తున్నాయి. తమకు చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయని, న్యాయస్థానాల ఉత్తర్వుల మేరకే భూమిని అభివృద్ధి చేస్తున్నామని ఆ కంపెనీల ప్రతినిధులు పేర్కొంటున్నారు. రాజకీయ నాయకులు తమ వ్యాపార లావాదేవీలను వివాదాల్లోకి లాగుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. చట్టపరమైన అనుమతులతోనే పనులు చేపడుతున్నామని, రైతులకు అన్యాయం చేసే ఉద్దేశం తమకు లేదని వారు చెప్పుకొస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో జరిగిన దాడులు, ప్రతిదాడులు చూస్తుంటే పరిస్థితి ఇరు పక్షాల మధ్య సయోధ్యకు దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. బౌన్సర్ల రాకతో ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. నాదర్‌గుల్ రైతుల ఆవేదనలో వాస్తవాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. 70 ఏళ్లుగా మూడు తరాలుగా ఈ భూమిని నమ్ముకుని బతుకుతున్నామని, ఇప్పుడు అకస్మాత్తుగా ఎవరో వచ్చి తమను భూమి నుంచి వెళ్లగొట్టాలని చూస్తే ఊరుకోబోమని వారు హెచ్చరిస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈ భూములను ప్రభుత్వ భూములుగా చెబుతూనే, ప్రైవేట్ కంపెనీలకు సహకరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రైవేటు సంస్థలకు మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందాల వల్లే తమ బతుకులు రోడ్డున పడుతున్నాయని చిన్న రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే ప్రైవేటు సైన్యం బరితెగించిందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. రాజకీయంగా ఈ అంశం బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తీవ్రస్థాయి యుద్ధానికి దారితీసింది. వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ప్రతిపక్షాలు గొంతు ఎత్తుతున్నాయి. ఇదే సమయంలో పాత రికార్డులను బయటకు తీసి గత పాలకుల తప్పులను ఎండగట్టాలని అధికార పక్షం ప్రయత్నిస్తోంది. ఈ రాజకీయ చదరంగంలో సాధారణ రైతు బలవుతున్నాడు. సర్వే నంబర్ 613 చుట్టూ అల్లుకున్న చిక్కుముడిని విప్పేందుకు అటు రెవెన్యూ యంత్రాంగం, ఇటు న్యాయ వ్యవస్థ తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ఈ భూపోరాటం మరింత హింసాత్మకంగా మారే ప్రమాదం పొంచి ఉంది. రంగారెడ్డి జిల్లాలోని అనేక శివారు ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్ని తాకడంతో ఇలాంటి వివాదాలు నిత్యకృత్యంగా మారాయి. నాదర్‌గుల్ ఘటన కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూమి కోర్టు కేసుల్లో చిక్కుకుని ఉంది. ఈ వివాదాల సాకుతో అటు ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోవడమే కాకుండా, ఇటు పేద రైతులు నిరంతరం భయం నీడలో బతకాల్సి వస్తోంది. సర్వే నంబర్ 613 విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు రాష్ట్రంలోని అనేక భూవివాదాలకు మార్గదర్శకం కానుంది. అంతవరకు శాంతిభద్రతలను కాపాడటం, సాగు చేసుకుంటున్న రైతులకు భరోసా ఇవ్వడం పాలకుల బాధ్యత.

# రూ. 15 వేల కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

- రూ.15 వేల కోట్ల విలువైన 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- కబ్జాదారుడు ముఖీం కట్టిన గెస్ట్ హౌస్, అపార్ట్‌మెంట్ నేలమట్టం
- ఇప్పటికే ఇళ్లు కట్టుకున్న వారికి ఇబ్బంది లేదని అధికారుల హామీ
- వివాదాస్పద భూమి ప్రభుత్వానిదేనని గతంలోనే హైకోర్టు తీర్పు
- చట్టాన్ని లెక్కచేయకుండా ముఖీం చేసిన అక్రమాలకు చెక్
- ఖాళీ భూమిని స్వాధీనం చేసుకుని అధికారులు కంచె వేశారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలో హైడ్రా శనివారం నాడు అత్యంత భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల సమన్వయంతో అధికారులు ఈ మెగా డ్రైవ్‌ను చేపట్టారు. ఈ భారీ ఆపరేషన్‌లో దాదాపు 861 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు తమ అధీనంలోకి తీసుకోవడం విశేషం. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఈ భూమి విలువ సుమారు 15,000 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని ప్రాథమిక అంచనా. కళ్లు చెదిరే ఈ భారీ ఆస్తిని కబ్జాదారుల చెర నుంచి విడిపించి, దానికి రక్షణగా పటిష్టమైన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియను అధికారులు యుద్ధప్రతిపాదికన పూర్తి చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా అమీన్‌పూర్ ప్రాంతంలో తిరుగులేని భూకబ్జాదారుడిగా ముద్రపడిన ఎం.ఏ. ముఖీం అక్రమ సామ్రాజ్యంపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. ముఖీం తన పలుకుబడిని ఉపయోగించి ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిలో నిర్మించిన విలాసవంతమైన కట్టడాలను అధికారులు నేలమట్టం చేశారు. ప్రధానంగా 40 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన భారీ గెస్ట్ హౌస్, అత్యాధునిక హంగులతో కూడిన ఫామ్‌హౌస్‌ను కూల్చివేశారు. ముఖీం సోదరుడు ఎం.ఏ. అజీం సైతం అక్రమంగా 2.20 ఎకరాల్లో నిర్మించిన ఆరు అంతస్తుల అపార్ట్‌మెంట్‌ను కూడా అధికారులు కూల్చివేశారు. విలాసవంతమైన స్విమ్మింగ్ పూల్స్, పశువుల పాకలు, గుర్రాల కోసం నిర్మించిన ప్రత్యేక షెడ్లను భారీ యంత్రాల సహాయంతో నేలమట్టం చేయడంతో ఈ ప్రాంతంలో ముఖీం అక్రమాలకు తెరపడింది. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఈలాపూర్ గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 1 నుంచి 220 వరకు ఉన్న మొత్తం 1,263 ఎకరాల భూమికి ఒక ప్రత్యేక చారిత్రక నేపథ్యం ఉంది. నిజాం పాలకుల కాలంలో ఈ భూమి 'నజాఫే ఖాన్' పేరుతో రాజవంశీయుల అధీనంలో ఉండేది. హైదరాబాద్ రాష్ట్ర విలీన ప్రక్రియ తర్వాత ఈ భూమి సహజంగానే ప్రభుత్వ ఆస్తిగా మారింది. అయితే, ఈ భూమిపై కొన్నేళ్లుగా అనేక న్యాయవివాదాలు కొనసాగుతున్నాయి. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, యథాతథ స్థితిని (స్టేటస్ కో) పాటించాలని 1998లోనే హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. అయినప్పటికీ కబ్జాదారులు కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ క్రయవిక్రయాలు సాగించడం గమనార్హం.

ఈ భూవివాదంపై 2003లో హైకోర్టు డివిజన్ బెంచ్ సైతం చారిత్రక తీర్పునిచ్చింది. 1,263 ఎకరాల భూమి పూర్తిగా ప్రభుత్వానిదేనని కోర్టు తేల్చిచెప్పింది. అయితే, ముఖీం వంటి వ్యక్తులు అప్పటి రాజకీయ నాయకుల అండదండలతో 2006 నుంచి ఇక్కడ యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడ్డారు. కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండానే ఈ భూమిలో లేఅవుట్లు చేయడం, అమాయక ప్రజలకు అమ్మడం ద్వారా వందల కోట్లు ఆర్జించినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ, అధికారులపై ఒత్తిళ్లు తీసుకువస్తూ ముఖీం సాగించిన ఈ దందాకు హైడ్రా తాజా చర్యలతో అడ్డుకట్ట పడింది. అధికారులు ఇప్పుడు కఠినంగా వ్యవహరిస్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. హైడ్రా చేపట్టిన ఈ మెగా ఆపరేషన్ సమయంలో స్థానిక పేద ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ ఇళ్లను కూడా కూల్చివేస్తారేమోనని భయపడ్డారు. అయితే, అధికారులు మైకుల ద్వారా ప్రకటన చేస్తూ పేదల ఇళ్లకు ఎలాంటి ముప్పు లేదని భరోసా ఇచ్చారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ గెస్ట్ హౌస్లు, ఫామ్ హౌస్లు, కబ్జాలో ఉన్న ఖాళీ భూములనే లక్ష్యంగా చేసుకున్నామని స్పష్టం చేయడంతో సామాన్యులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం 1,263 ఎకరాల్లో ఇప్పటికే నిర్మాణాలు జరిగి, ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలను మినహాయించి, ఖాళీగా ఉన్న 861 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు గణాంకాలతో వివరించారు. ఈ స్పష్టతతో స్థానికుల్లో నెలకొన్న ఉద్రిక్తత కొంత మేర తగ్గింది. మరోవైపు, అమీన్‌పూర్ భూముల్లో ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్న పాత లేఅవుట్ల యజమానులు హైడ్రా చర్యపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము కొనుగోలు చేసిన భూములను ముఖీం వర్గం దౌర్జన్యంగా ఆక్రమించిందని, నేడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో తమకు న్యాయం జరుగుతుందని వారు భావిస్తున్నారు. ముఖీం అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న సమయంలో బాధితులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకోవడం క్షేత్రస్థాయిలో పరిస్థితికి అద్దం పడుతోంది. ఎన్నో ఏళ్లుగా రౌడీయిజం, రాజకీయ పలుకుబడితో సాగిన అరాచకానికి నేటితో తెరపడిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడటమే కాకుండా బాధితుల పక్షాన నిలిచినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచే సుమారు 200 మందికి పైగా పోలీసుల బందోబస్తు నడుమ ఈ కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. ఎనిమిది భారీ జేసీబీలు, పొక్లెయిన్లతో అక్రమ కట్టడాలను ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్ సాఫీగా సాగేందుకు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించారు. ముఖీం గెస్ట్ హౌస్‌లో ఉన్న ఖరీదైన సామాగ్రిని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూమిలో ఒక అంగుళం కూడా వదిలే ప్రసక్తే లేదని హైడ్రా అధికారులు హెచ్చరిస్తున్నారు. భారీగా మోహరించిన బలగాల కారణంగా కబ్జాదారులు ఎలాంటి ఆందోళనలు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. క్రమశిక్షణతో సాగిన ఈ ఆపరేషన్ అమీన్‌పూర్ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా ఈ భూములపై అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు వెనక్కి తగ్గేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం హైడ్రాకు పూర్తి అధికారాలు ఇవ్వడంతో అక్రమార్కుల ఆటలు సాగడం లేదు. ముఖీం వంటి వారు స్థానిక అధికారులను లోబరుచుకుని ఇష్టానుసారంగా ఎన్‌ఓసీలు పొందడం, అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించడంపై కూడా ఉన్నత స్థాయి దర్యాప్తు జరుగుతోంది. ఈ భారీ స్కామ్‌లో సహకరించిన కొందరు కింది స్థాయి అధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. 15 వేల కోట్ల విలువైన ప్రభుత్వ సంపదను కాపాడటం ద్వారా ప్రభుత్వం తన దృఢ సంకల్పాన్ని చాటుకుంది. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, మరిన్ని ఆక్రమణలపై చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఈ ఆపరేషన్ ద్వారా స్వాధీనం చేసుకున్న 861 ఎకరాల భూమిలో త్వరలోనే ప్రభుత్వ ప్రాజెక్టులు లేదా పార్కులను నిర్మించే అవకాశం ఉంది. స్వాధీనం చేసుకున్న వెంటనే భూమి చుట్టూ ఇనుప కంచె (ఫెన్సింగ్) వేసి, ఇది ప్రభుత్వ భూమి అని బోర్డులను ఏర్పాటు చేశారు. రక్షణ కోసం ప్రత్యేకంగా గార్డులను కూడా నియమించాలని యోచిస్తున్నారు. భవిష్యత్తులో ఈ భూమి మళ్లీ కబ్జాకు గురికాకుండా ఉండటానికి శాటిలైట్ మ్యాపింగ్ చేయాలని నిర్ణయించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీకి ఈ భూమి ఒక ప్రధాన ఆస్తిగా మారనుంది. దీని ద్వారా వచ్చే ఆదాయం లేదా ఇక్కడ చేపట్టే అభివృద్ధి పనుల వల్ల స్థానిక ప్రాంతం రూపురేఖలు మారతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖీం సోదరులు అక్రమంగా చేపట్టిన అపార్ట్‌మెంట్ నిర్మాణం వల్ల అనేక మంది కొనుగోలుదారులు నష్టపోయే ప్రమాదం ఉంది. అనుమతులు లేకుండా కట్టిన కట్టడాలను కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. అమీన్‌పూర్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఇలాంటి భూమి కుంభకోణాలు తరచుగా వెలుగులోకి వస్తుంటాయి. ఈ తాజా ఆపరేషన్ ఇతర భూ కబ్జాదారులకు ఒక గట్టి హెచ్చరికలా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. చట్టాన్ని అతిక్రమించి నిర్మించిన ఏ కట్టడమైనా కూల్చివేతకు గురవ్వక తప్పదని హైడ్రా మరోసారి నిరూపించింది. పేదలకు అన్యాయం జరగకుండా అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం విశేషం.



# ఫ్యూడల్ శక్తులు ఏకమవుతున్నాయి

- ఫ్యూడల్ శక్తుల నుండి ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి
- విద్యకు బడ్జెట్‌లో 13.5శాతం నిధులు, 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యార్థుల డైట్ చార్జీల పెంపు, స్కూళ్లలో అల్పాహార పథకం
- బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి
- కుల గణన ఆధారంగానే నియోజకవర్గాల విభజన జరగాలి
- పూలే ఆశయాల సాధనే ప్రభుత్వ లక్ష్యమని భట్టి ఉద్ఘాటన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో గడిచిన కాలపు ఫ్యూడల్ శక్తులు మళ్లీ ఏకమై పాత రోజులను తీసుకురావాలని కుట్రలు చేస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయాన్ని ఆకాంక్షించే అట్టడుగు వర్గాలు, బహుజనులందరూ ఐక్యంగా నిలిచి ప్రస్తుత ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన చారిత్రక అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన అధికారిక కార్యక్రమానికి భట్టి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వేదికపై పూలే చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ సమాజంలోని అసమానతలను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. జ్యోతిరావు పూలే ఏ ఆశయాల కోసం తన జీవితాన్ని ధారపోశారో, అవే విలువల ప్రాతిపదికన అంతరాలు లేని నవ సమాజ నిర్మాణం కోసం ప్రస్తుత సర్కారు నిరంతరం శ్రమిస్తోందని భట్టి వివరించారు. పేదరికం నుంచి విముక్తి లభించాలంటే విద్య ఒక్కటే సరైన మార్గమని నమ్మి, బడ్జెట్‌లో విద్యా రంగానికి ఏకంగా 13.5 శాతం నిధులను కేటాయించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన పాఠశాల విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన బోధన అందించడమే పరమావధిగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని సభకు వివరించారు. అట్టడుగు వర్గాల బిడ్డలకు అంతర్జాతీయ స్థాయి విద్యను చేరువ చేసే క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ సంస్థలకు దీటైన విద్యాబోధన అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వీటితో పాటు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 15 కోట్ల రూపాయల వ్యయంతో సకల సౌకర్యాలతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనకరంగా మారుతాయని, విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం, పోషణ విషయంలో ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో కీలక నిర్ణయాలు తీసుకుందని భట్టి తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం మేర పెంచామని, అలాగే కాస్మోటిక్ చార్జీలను 200 శాతం మేర భారీగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశామని గుర్తు చేశారు. సుమారు 20 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆకలి తీర్చేందుకు జూన్ 2వ తేదీ నుంచి ఉదయం పూట అల్పాహారం అందించే నూతన పథకాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. ఇప్పటికే పాఠశాలల్లో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు కూడా విస్తరించాలని నిర్ణయించినట్లు ఆయన సభకు తెలియజేశారు. రాజకీయ, సామాజిక సాధికారత సాధించడమే పూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్ల శాతం పెరిగినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ప్రభుత్వం నిరంతరం పోరాటం సాగిస్తుందని, ఈ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా వినిపించారు. దేశవ్యాప్త నియోజకవర్గాల పునర్విభజన అంశంపై భట్టి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగా మాత్రమే నియోజకవర్గాల విభజన చేపడితే అది దక్షిణాది రాష్ట్రాల ఉనికికే ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించారు. జనాభా నియంత్రణ పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణ రాష్ట్రాలు దీనివల్ల రాజకీయంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందారు. కుల గణనను ప్రాతిపదికగా తీసుకోకుండా విభజన ప్రక్రియ చేపడితే సమాజంలోని కీలక వర్గాలకు అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శాస్త్రీయమైన పద్ధతిలో కుల గణన నిర్వహించి, ఆ గణాంకాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రానికి సూచించారు. బహుజన సామాజిక వర్గాల ఐక్యత ఈ సమయంలో అత్యంత ఆవశ్యకమని భట్టి ఉద్ఘాటించారు.



# కాళేశ్వరం విచారణకు కేసీఆర్?

- కాళేశ్వరం అవినీతిపై సీబీఐ దర్యాప్తుకు సన్నాహాలు
- రాష్ట్ర అధికారులు ఢిల్లీ వెళ్లి సీబీఐకి కావాల్సిన వివరణ
- పీసీ ఘోష్ నివేదికలోని అవినీతి అంశాలపై విచారణ
- కేసీఆర్, హరీశ్‌రావులపై చర్యల విషయంలో హైకోర్టు స్టే
- సీబీఐ రంగంలోకి దిగితే కేసీఆర్, అధికారులకు విచారణ
- దర్యాప్తుపై ఏ రోజైనా సీబీఐ నుంచి అధికారిక ప్రకటన





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర సాగునీటి రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమని ప్రచారం పొందిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో చోటుచేసుకున్న భారీ అక్రమాలు, నిధుల మళ్లింపు అంశాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ తన పదునైన అస్త్రాలను సిద్ధం చేస్తోంది. ప్రాజెక్టు రీడిజైనింగ్ మొదలుకొని కాంట్రాక్టుల కేటాయింపు వరకు జరిగిన ప్రతి దశలోనూ లోతైన విచారణ జరిపేందుకు ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం అందుతోంది. గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల ప్రజా ధనం దుర్వినియోగం అయిందన్న ఆరోపణల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకుని ఈ కీలక ముందడుగు పడింది. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక మరియు యాంత్రిక అంశాలపై సీబీఐ ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రాథమిక విశ్లేషణను పూర్తి చేశారు. దాదాపు రూ. 1,20,000 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో జరిగిన లోపాలపై స్పష్టమైన ఆధారాలను సేకరించడంపై ప్రస్తుతం దృష్టి సారించారు. గత ఏడాది సెప్టెంబరు మాసంలోనే రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు కోరుతూ కేంద్రానికి అధికారికంగా లేఖ రాసింది. అయితే ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరగడంతో రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తున్న తరుణంలో, సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలోని సీనియర్ అధికారుల బృందం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించింది. ప్రాజెక్టు నిర్మాణంలో పాటించాల్సిన కేంద్ర జల సంఘం నిబంధనలను తుంగలో తొక్కినట్లు దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా గుర్తించింది. ప్రధానంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాల వెనుక కేవలం ప్రకృతి వైపరీత్యాలు మాత్రమే లేవని, మానవ తప్పిదాలతో పాటు భారీ అవినీతి కోణం దాగి ఉందని సీబీఐ అధికారులు భావిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని ఎంక్వయిరీ కమిషన్ నివేదిక అత్యంత కీలకంగా మారింది. కమిషన్ తన విచారణలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఐఏఎస్ అధికారులు, ఇంజనీర్ ఇన్ చీఫ్ స్థాయి అధికారుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. ఈ నివేదికలో ప్రాజెక్టు అంచనాల పెంపులో శాస్త్రీయత లోపించిందని, కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేలా నిబంధనలు సవరించారని పేర్కొనడం సంచలనం సృష్టిస్తోంది. జస్టిస్ ఘోష్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించడమే కాకుండా, దర్యాప్తును కేంద్ర సంస్థకు అప్పగించే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ డాక్యుమెంట్లు ఇప్పుడు సీబీఐ చేతికి అందడంతో విచారణ వేగం పుంజుకోనుంది. సీబీఐ అడిగిన మరిన్ని క్లారిఫికేషన్ల కోసం రాష్ట్ర హోంశాఖ, సాగునీటి శాఖ అధికారుల బృందం ఇటీవలే ఢిల్లీలో పర్యటించింది. సీబీఐ అధికారులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర బృందం సమగ్రమైన వివరణలు ఇచ్చింది. ముఖ్యంగా రూ. 80,000 కోట్లకు పైగా రుణాల రూపంలో సేకరించిన నిధుల వినియోగంపై సీబీఐ ఆడిట్ విభాగానికి అనుమానాలు ఉన్నాయి. ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రారంభంలో రూ. 38,000 కోట్లుగా ఉండగా, అది క్రమంగా రూ. 1.2 లక్షల కోట్లకు ఎలా పెరిగిందనే అంశంపై గణాంకాలతో కూడిన నివేదికను సీబీఐ కోరింది. రాష్ట్ర అధికారులు అందించిన సమాచారంతో దర్యాప్తు సంస్థ సంతృప్తి చెందినట్లు తెలుస్తోంది. ఏ క్షణంలోనైనా అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాలేదు. టెక్నికల్ అంశాల్లోనూ భారీ లోపాలు ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి దారితీసిన పరిస్థితులు, పిల్లర్ల డిజైన్లలో చేసిన మార్పులు అధికారుల అజమాయిషీ లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి. రూ. 14,000 కోట్ల వ్యయంతో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ నేడు నిరుపయోగంగా మారడం వెనుక ఉన్న కుట్ర కోణాన్ని సీబీఐ ఛేదించాల్సి ఉంది. పంపు హౌస్‌ల నిర్మాణం, మోటార్ల కొనుగోలులో విదేశీ సంస్థల పాత్ర, కమీషన్ల రూపంలో అందిన లబ్ధిపై కూడా నిఘా పెట్టారు. ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టాన్ని లెక్కగట్టే క్రమంలో ఆర్థిక నిపుణుల సలహాలను సీబీఐ తీసుకుంటోంది. మరోవైపు ఈ కేసు చుట్టూ న్యాయపరమైన చిక్కులు కూడా అల్లుకుని ఉన్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా తమపై ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా చూడాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, ప్రస్తుతానికి వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, సీబీఐ దర్యాప్తు అనేది స్వతంత్రమైన ప్రక్రియ కావడంతో, కోర్టు స్టే కేవలం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని చర్యలకే పరిమితమవుతుందా లేక సీబీఐ విచారణకు కూడా అడ్డంకిగా మారుతుందా అన్నది చర్చనీయాంశమైంది. న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అవినీతి నిరోధక చట్టం కింద సీబీఐ తన విచారణను నిరాటంకంగా కొనసాగించవచ్చు. దర్యాప్తు ప్రారంభమైతే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీశ్‌రావులను సీబీఐ మరోసారి విచారణకు పిలిచే అవకాశం ఉంది. ప్రాజెక్టు రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, సాగునీటి శాఖ మాజీ సలహాదారులు సీబీఐ రాడార్‌లో ఉన్నారు. ముఖ్యంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించిన నాటి ముఖ్యమంత్రి, నిధుల సమీకరణలో కీలక పాత్ర పోషించిన ఆర్థిక శాఖ అధికారుల పాత్రపై లోతైన విచారణ జరగనుంది. కాంట్రాక్టు సంస్థలైన మెగా ఇంజనీరింగ్ వంటి కంపెనీల ప్రతినిధులను కూడా సీబీఐ ప్రశ్నించే అవకాశం ఉంది. బిల్లుల చెల్లింపులో చూపిన ఉత్సాహం, పనుల నాణ్యత పరిశీలనలో ఎందుకు చూపలేదన్నది ఇక్కడ ప్రధాన ప్రశ్న. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు నిలువుటద్దంగా నిలవాల్సిన కాళేశ్వరం, నేడు రాజకీయ ప్రకంపనలకు కేంద్రబిందువైంది. ప్రాజెక్టు అప్పుల భారం రాష్ట్ర బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏటా వడ్డీల రూపంలోనే వేల కోట్లు చెల్లించాల్సి రావడం గమనార్హం. ప్రాజెక్టు ద్వారా ఆశించిన 18 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి రాకపోవడం, కేవలం కొన్ని వేల ఎకరాలకే పరిమితం కావడం వెనుక ఉన్న వాస్తవాలను సీబీఐ వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు. నిర్మాణ సమయంలో వాడిన కాంక్రీట్ నాణ్యత, ఐరన్ పరిమాణం వంటి భౌతిక అంశాలపై సీబీఐ తన టెక్నికల్ టీమ్ ద్వారా క్షేత్రస్థాయిలో పరీక్షలు నిర్వహించనుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఈ విచారణ ఒక కొలిక్కి వస్తుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సీబీఐ దర్యాప్తు సాధారణంగా సుదీర్ఘకాలం పాటు కొనసాగుతుంది. దాదాపు రెండేళ్లుగా ఈ ప్రక్రియ నలుగుతున్న నేపథ్యంలో, ఇకపై విచారణ వేగవంతం కాకపోతే రాజకీయ లబ్ధి కోసమే ఈ విచారణలు అన్న ఆరోపణలు బలపడతాయి. అయితే ఈసారి కేంద్రం పక్కా ఆధారాలతో ముందుకు వెళ్లాలని భావిస్తోంది. విదేశీ బ్యాంకు ఖాతాల్లోకి నిధుల మళ్లింపు జరిగిందా అనే కోణంలో ఈడీ సహాయాన్ని కూడా సీబీఐ తీసుకునే అవకాశం ఉంది. ఇది జరిగితే కాళేశ్వరం కేసు జాతీయ స్థాయిలో పెను సంచలనంగా మారడం ఖాయం. రాజకీయంగా ఈ వ్యవహారం తెలంగాణలో పెను మార్పులకు దారితీసేలా కనిపిస్తోంది. గత ప్రభుత్వ పెద్దలు ఈ ప్రాజెక్టును తమ విజయగాథగా చెప్పుకోగా, ప్రస్తుత పాలక పక్షం దీనిని అతిపెద్ద కుంభకోణంగా అభివర్ణిస్తోంది. రాష్ట్ర సచివాలయంలోని సాగునీటి శాఖ రికార్డులను ఇప్పటికే సీబీఐ పరిశీలన కోసం భద్రపరిచారు. దర్యాప్తు ప్రారంభమైన వెంటనే కొన్ని కీలకమైన ఫైళ్లను సీబీఐ స్వాధీనం చేసుకోనుంది. ఇందులో భాగంగానే పాత ఫైళ్లను తారుమారు చేసే అవకాశం ఉందన్న అనుమానంతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు.

## పూలే ఆలోచనలను కొనసాగిద్దాం

**సిపిఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్**



**సికింద్రాబాద్,విశాలభారతి:** సామాజిక విప్లవకారుడు,అట్టడుగు వర్గాల జీవితాలలో విద్యా అనే ఆయుధంతో వెలుగులు నింపిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని సిపిఐ ఆధ్వర్యంలో లాల పేటలోని పూలే విగ్రహానికి నివాళులర్పించడం జరిగింది. జ్యోతిరావు పూలే ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడమే అసలైన నివాళి అని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, అడ్డగుట్ట కార్యదర్శి గౌరీ నాగరాజ్, తార్నాక డివిజన్ సెక్రెటరీ సయ్యద్ గౌస్,వరలక్ష్మి ,రామలీల లలిత తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో పూలే జయంతి



**నిజామాబాద్, విశాలభారతి:** మహాత్మా జ్యోతిరావు పూలే 200 జయంతి సందర్భంగా కాంగ్రెస్ భవన్ నందు నిజామాబాద్ నగర కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆ మహాత్ముని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం వినాయక నగర్ లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిబా పూలే గాభారతీయ సామాజిక విప్లవ పితామహుడు, మహిళా విద్య మరియు దళితుల హక్కుల కోసం పోరాడిన గొప్ప సంస్కర్త. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారు. సత్యశోధక్ సమాజ్ ద్వారా కుల వివక్షకు వ్యతిరేకంగా, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, జిల్లా డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి ,డిసిసి కోశాధికారి భక్తవత్సలం, డిసిసి ఉపాధ్యక్షులు కౌడపు శరత్ ,జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్ ,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, ఎఐసిసి కోఆర్డినేటర్ గన్ రాజ్, కార్పొరేటర్ ప్రవీణ్, కార్పొరేటర్ మనోహర్ ,వినయ్, లవంగ ప్రమోద్, సంగం సాయిలు, దాత్రిక భాస్కర్ ,కోనేరు సాయికుమార్ , ముల్గురి గణేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు



**కోదాడ, విశాలభారతి:** రాజకీయాలకు అతీతంగా పూలే జయంతిలో పాల్గొన్న అన్ని పార్టీల నేతలు.

సామాజిక వేత్తగా, దళిత బహుజన మహిళ వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని పలువురు పట్టణ ప్రముఖులు అన్నారు. పూలే జయంతి సందర్భంగా కోదాడ పట్టణంలోని రాజీవ్ చౌక్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి నిర్వహణ కమిటీ కన్వీనర్ పాలూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ, సుధీర్, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, అన్ని పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, కుల సంఘాల నాయకులు మున్సిపల్ కౌన్సిలర్లు లు పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మార్పు, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం మహిళోద్ధరణకు ఆయన చేసిన సేవలను స్మరించారు. పూలే ఆశయాల సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీఎన్ ప్రసాద్, ఏపూరి రాజు మాదిగ, చింతాబాబు మాదిగ, సైదా నాయక్, వాల్యా నాయక్, చైతన్య నాయక్,రాజు నాయక్, ఈదుల కృష్ణయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, సంగిశెట్టి గోపాల్, గుండు పంగు రమేష్, పిడతల శ్రీను, చింతలపాటి శ్రీను, కాంపాటి శ్రీను, బాగ్దాద్, పంది తిరపయ్య, భాజాన్, మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ ప్రజా ప్రతినిధులు బిసి, ఎస్సి, ఎస్టి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



**ఆర్మూర్, విశాలభారతి :** మాక్లూర్ మండలంలో చిట్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం మాక్లూర్ మండలంలోని చిట్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూమన్న మాట్లాడుతూకులవ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ విద్య అభివృద్ధికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు విశేషమన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు విద్య అందించేందుకు ఆయన కృషి చేసి, స్త్రీలకు తొలి పాఠశాలను ప్రారంభించి సమానత్వ సమాజ నిర్మాణానికి బాటలు వేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూమన్న, ఉప సర్పంచ్ సతీష్ . గ్రామపంచాయతీ కార్యదర్శి,గ్రామ వార్డు సభ్యులు, జీపీ సిబ్బంది మహిళాసంఘ సభ్యులు, యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే




**కోదాడ, విశాలభారతి:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు అన్నారు. శనివారం కోదాడ మునిసిపల్ కార్యాలయం లో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు. అనంతరం ఆమె మాట్లాడుతూ పూలే మహిళా విద్యకు,సామాజిక సమానత్వానికి బాటలు వేసిన మహనీయుడన్నారు. సంఘ సంస్కర్త గా నాడు సమాజం లో ఉన్న రుగ్మతలను రూపుమాపడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగ శీలి అన్నారు. పూలే అభ్యుదయ భావాల తోనే సమాజ చైతన్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, కౌన్సిలర్ లు సిబ్బంది ఉన్నారు.

## పథకాల అమలులో భాగస్వాములు కావాలి



**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్, విశాలభారతి:** వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు విస్తృత స్థాయిలో సమాచారం చేరడంలో సామాజిక మాధ్యమాలు ఎంతో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు కూడా సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాలను విస్తృత స్థాయిలో ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో నిజామాబాద్ జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల సేవలను వినియోగించుకునేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా గణనీయమైన సంఖ్యలో ఫాలోవర్లు కలిగి ఉన్న సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు ఎంతో ఉత్సాహంతో తరలివచ్చి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, డీఈఓ అశోక్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీపీఆర్ఓ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పూలే 199వ జయంతి వేడుకలు



**కూకట్ పల్లి విశాలభారతి:**

సమాజంలో అణచివేతకు గురవుతున్న వర్గాల సాధికారత కోసం, మహిళా విద్య కోసం జీవితాన్ని ధారపోసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని హెచ్ఏఎల్ (HAL) యాక్సెసరీస్ విభాగం సీఈఓ సత్యనారాయణ కొనియాడారు. శనివారం హెచ్ఏఎల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే 199వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

**ఘన నివాళులు అర్పించిన ప్రముఖులు**

సంఘం అధ్యక్షుడు రవికుమార్ ముదిరాజ్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్ఏఎల్ యాక్సెసరీస్ విభాగం సీఈఓ సత్యనారాయణ హాజరుకాగా, గౌరవ అతిథులుగా హైదరాబాద్ అవినిక్స్ ఈడీ రామ్మోహన్ రావు, సిఓపి చీఫ్ మురళీ కృష్ణ, లైసన్ ఆఫీసర్ శ్రీహరి రావు విచ్చేశారు. వారు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు.

**మహిళా సాధికారతకు పూలే స్ఫూర్తి**

ఈ సందర్భంగా సీఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ.. నేడు మనం అనుభవిస్తున్న హక్కులు ఎందరో మహనీయుల పోరాట ఫలితమని గుర్తుచేశారు. "దేశంలో అణచివేతకు గురవుతున్న మహిళలకు అక్షర జ్ఞానాన్ని అందించి, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత పూలేకే దక్కుతుంది. ఆయన ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయం," అని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వెంకటాద్రి, ఆర్. వెంగళ్ రావు, కర్క నాగరాజ్, జీవన్, శ్రీనివాస్ బాబు, విజయ్ ప్రసాద్‌తో పాటు ఓబీసీ ఆఫీస్ బేరర్లు మధు సూధన్, చలం, కేవీ రవికుమార్, చంద్ర శేఖర్, భూపాల్, భాగ్య లక్ష్మి, సాయికుమార్ గౌలికర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా అక్షరాస్యతకు జ్యోతిబా పూలే ఎనలేని కృషి

- అసమానతలను వ్యతిరేకించిన గొప్ప వ్యక్తి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా

**నిజామాబాద్, విశాలభారతి:**

మహిళా అక్షరాస్యతకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జ్యోతి బా పూలే జయంతి ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల కోసం సతీమణి సావిత్రి భాయి పూలే తో కలిసి మొట్టమొదటి పాఠశాలను నెలకొల్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహాయోధుడు అని తెలిపారు. ప్రధానంగా మహిళల విద్యకు ఆయన చేసిన సేవలు అపూర్వమైనవని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం చేయాలని లక్ష్యంతో సత్యశోధ కు సమాజాన్ని స్థాపించారని గుర్తు చేశారు. ఒక మహానుభావుడిని గుర్తు చేసుకోవడం మాత్రమే కాదని, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడం అందరి బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ కూడా మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి ప్రజలను మభ్యపెడుతుందన్నారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళిక రూపొందించకుండా మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, కార్పొరేటర్లు జ్యోతి మురళి, మల్లేష్ యాదవ్, బెల్లాల్ శశాంక్, జగదీష్ కులకర్ణి, బంటు ప్రీతి ప్రవీణ్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సవాలు విసిరాం..స్థలానికి వచ్చాం

**బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి**



**నిజామాబాద్, విశాలభారతి:** రూరల్ నియోజకవర్గం లో పోలీస్ లు ఎన్నివిధాలా అడ్డుకోవాలని చుసిన వారికి చిక్కకుండా బైక్ పైన పెద్దమ్మ గుడి వద్దకు చేరుకున్నారు వాడి పెద్దమ్మ గుడి దగ్గర బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి పై ధ్వజమెత్తారు. మాట ఇస్తే నిలబెట్టుకోవడం మా సంస్కారం, మాట తప్పడం మీ అలవాటు అని దినేష్ పటేల్ కులాచారి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న సవాలు విసిరినట్లుగానే ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ రోజు ఉదయం పెద్దమ్మ గుడి వద్దకు వచ్చాను, కానీ భూపతి రెడ్డి మాత్రం ప్రజల ముందుకు రావడానికి భయపడ్డాడు, రైతులకు నష్టపరిహారం ఇచ్చామని గొప్పలు చెప్పడం సులువు, కానీ ఆధారాలు చూపడం ఎందుకు కష్టం? ఎంతమందికి ఇచ్చావ్? ఏ గ్రామాలకు ఇచ్చావ్? ఎవరికి ఒక్క రూపాయి అయినా చేరిందా? అని నేరుగా ప్రశ్నల వర్షం కురిపించారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుక

**చిత్రపటానికి నివాళులర్పించిన చైర్‌పర్సన్**



**చౌటుప్పల్, విశాలభారతి:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, స్త్రీ విద్యకు ఆద్యుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శనివారం పురపాలక కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..సమాజంలోని అసమానతలను తొలగించి, వెనుకబడిన వర్గాలకు విద్యాఫలాలు అందేలా పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంగ్లీ పై బెదిరింపులు, అపవాదులు.. న్యాయవాదిపై కేసు



**రాజేంద్రనగర్, విశాలభారతి:** ప్రముఖ గాయని, నటి సత్యవతి రాథోడ్ (మంగ్లీ )కు బెదిరింపులు, పరువు నష్టం చేసే చర్యల నేపథ్యంలో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఓ న్యాయవాదిపై కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం ప్రకారం, గత నెల మార్చి 24వ తేదీ ఉదయం సుమారు 7 గంటల సమయంలో మంగ్లీ ఫిర్యాదు చేశారు. తాను ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విజయంతి అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నట్లు తెలిపారు. తార్నాకకు చెందిన సుభా సింగబోష్ అనే న్యాయవాది తనపై అసత్య ఆరోపణలు చేస్తూ, తాను రూ.150 కోట్ల మేర ప్రజలను మోసం చేసిందని ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలను మంగ్లీ పూర్తిగా ఖండించారు. ఇక మార్చి 21న మధ్యాహ్నం సమయంలో సుభా సియాపోగు అనే వ్యక్తి ఫోన్ చేసి తనను కలవాలని ఒత్తిడి తెచ్చాడని తెలిపారు. తాను నిరాకరించడంతో పరువు తీస్తానని, మర్యాదకు భంగం కలిగిస్తానని బెదిరించాడని పేర్కొన్నారు. అతనితో పాటు మరో వ్యక్తి కూడా తనపై, తన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. సంబంధం లేని కరెన్సీ నోట్ల కట్టల వీడియో చూపిస్తూ మానసిక ఒత్తిడి కలిగించారని ఆరోపించారు. ఈ ఘటనల కారణంగా తాను, తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నామని, సామాజికంగా అవమానానికి గురవుతున్నామని మంగ్లీ తెలిపారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 547/2026గా కేసు నమోదు చేసి, భారత న్యాయ సంహిత (BNS) సెక్షన్ 79, 351(3) కింద దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును ఎస్ఐ మునీందర్ విచారణ చేస్తున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను రాజేంద్రనగర్‌లోని XIII జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు.

# ఉప్పరిగూడెంలో దళారుల దోపిడీ రాజ్యం!

- మొక్కజొన్న కొనుగోలులో అధికారుల నిర్లక్ష్యం
- మొక్కజొన్న రైతుల మొర వినని అధికారులు
- కొనుగోలు కేంద్రం లేక మధ్యవర్తుల దోపిడీ
- రూ.2300 మద్దతు ధర కాగితాలకే పరిమితం



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం ఉప్పరిగూడెం గ్రామంలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఐకేపీ మార్కెట్ ద్వారా ఒక క్వింటా మొక్కజొన్నకు రూ.2300 చెల్లించాలని నిర్ణయించినప్పటికీ, గ్రామంలో సరైన కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. కొనుగోలు సౌకర్యం లేకపోవడం వల్ల రైతులు తమ పంటను విక్రయించడానికి ఇబ్బందులు పడుతూ, చివరికి మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్న దళారులు తక్కువ ధరలకు మొక్కజొన్నను కొనుగోలు చేస్తూ రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ మల్లికంటి సురేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, స్థానిక స్థాయిలో అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. సీరోల్ మండలంలో విస్తారంగా మొక్కజొన్న సాగు జరిగిన నేపథ్యంలో ఉప్పరిగూడెం గ్రామంలోనే ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా, రైతులు మోసపోకుండా అధికారులు కచ్చితమైన పర్యవేక్షణ చేపట్టాలని, ప్రభుత్వ నిర్ణయించిన కనీస మద్దతు ధరకు పంట కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. రైతుల కష్టానికి తగిన ఫలితం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఫుట్‌బాల్ పోటీల్లో చైతన్య యూనివర్సిటీ జట్టు విజయం

**విద్యార్థుల ప్రతిభపై ఛాన్సలర్ పురుషోత్తం రెడ్డి అభినందనలు**



మొయినాబాద్ , విశాలభారతి: మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఉన్న చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. హైదరాబాద్‌లోని లార్డ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించిన ఈ పోటీల్లో చైతన్య యూనివర్సిటీ జట్టు ప్రతిభ చూపి ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేతలైన జట్టును యూనివర్సిటీ ఫౌండర్ మరియు ఛాన్సలర్ సీ.హెచ్.వి. పురుషోత్తం రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రదర్శించిన అంకితభావం, క్రమశిక్షణ, జట్టు సహకారం, పోరాట స్ఫూర్తి విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత పెంచిందని తెలిపారు. క్రీడల్లో సాధించిన ఈ విజయం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహం, పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించి విశ్వవిద్యాలయానికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీ.హెచ్. సాత్విక రెడ్డి, వైస్ ఛాన్సలర్ జీ. శంకర్ లింగం, రిజిస్ట్రార్ రవీందర్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పీ. మధుసూదన్ రెడ్డి, బి. కుమారస్వామి, రాము, రాజేష్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్‌లో గ్రంథాలయ భవనానికి భూమి పూజ

**రూ.2.15 కోట్లతో నిర్మాణం – ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న గ్రంథాలయ భవనానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై భూమి పూజ నిర్వహించారు.శనివారం 15వ వార్డు పరిధిలో రూ.2 కోట్ల 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రంథాలయ భవన పనులను రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రంథాలయ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మొయినాబాద్‌లో విద్యాభివృద్ధికి ఈ గ్రంథాలయం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పీ.జీ.వి. రాణి, కౌన్సిలర్లు పల్లగోల్ల విజయలక్ష్మి, అశోక్ యాదవ్, గడ్డం వెంకట్ రెడ్డి లక్ష్మీ, వజిత్, అరుణ రామకృష్ణ గౌడ్, అప్పల సంధ్య, సురేష్ యాదవ్, విక్రమ్ రెడ్డి, అలాగే నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నార్సింగిలో నిర్మాణ స్థలంలో కార్మికుడి మృతి

**బిల్డర్ చర్యలపై అనుమానాలు**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి ఓ అనుమానాస్పద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి బీహార్‌కు చెందిన కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, మణికొండలోని శ్రీరామ్ కాలనీ, త్రివేణి స్కూల్ సమీపంలో ఓ బిల్డర్ జి+5 భవన నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో ఓ కార్మికుడు భవనం పైనుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. అయితే ఘటన అనంతరం బిల్డర్ ప్రవర్తన పలు అనుమానాలకు దారి తీసింది. పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే, ఎలాంటి పంచనామా నిర్వహించకుండానే మృతదేహాన్ని వెంటనే ప్రైవేట్ ట్రాలీ ఆటోలో తరలించినట్లు సమాచారం. అంతేకాకుండా, అక్కడ పనిచేస్తున్న ఇతర కార్మికులను కూడా త్వరితగతిన వేరే ప్రాంతాలకు తరలించడం గమనార్హం. ఈ చర్యలపై సహచర కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అంబులెన్స్‌లో తరలించలేదా అంటూ ప్రశ్నించారు. తమ ప్రాణాలకు విలువ ఇవ్వలేదని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, అర్ధరాత్రి సమయంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయా? లేక ఇది నిజంగా ప్రమాదమా? అనే అంశాలపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. అభిమానులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుంటూ తమ అభిమాన నాయకుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద అంబర్‌పేట్ మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్ గౌని భాస్కర్ గౌడ్, చెట్టి నవీన్ గౌడ్, బాబు గౌడ్ తదితరులు పాల్గొని మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.పసుమాముల గ్రామం సహా పలు ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో చేరిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు నియోజకవర్గంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పాయి.

## విద్యా ఆనే ఆయుధంతో వెలుగులు నింపిన పూలే

**బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి**



**ముషీరాబాద్, విశాలభారతి:** అట్టడుగు వర్గాల జీవితాల్లో విద్య అనే ఆయుధంతో మహాత్మ జ్యోతిరావు పూలే వెలుగులు నింపారని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకొని శనివారం సైనిక్పురి చౌరస్తాలో పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అణిచివేతకు గురవుతున్న వర్గాల సాధికారత కోసం మహిళా విద్య కోసం జీవితాన్ని ధారబోసిన మహోన్నత వ్యక్తి మాత్మ జ్యోతిరావు పూలే దంపతులని అన్నారు. సమాజానికి విద్య నేర్పిన పూలే జయంతిని గ్రామం మండలం జిల్లా రాష్ట్రవ్యాప్తంగా జయంతి ఉత్సవాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో నెక్లెస్ రోడ్ లో జ్యోతి బాపూలే సావిత్రిబాయి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశరాజ్ మల్లేష్, తాటికొండ శ్రీనివాస్, నర్సింగ్ రావు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్

**కోదాడ, విశాలభారతి:** పెనుగ్రంచిపోలులోని శ్రీ లక్ష్మి తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల దేవాలయ సన్నిధిలో వివాహం చేసుకున్న కోదాడకు చెందిన నూతన వధూవరులు గుంజ.సాయి, వైష్ణవి లను ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ శాసన మండలి సభ్యులు తొండపు. దశరథ జనార్ధన్ శనివారం ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ మాట్లాడుతూ చిరకాలం దాంపత్య జీవితం దేవతామూర్తుల ఆశీస్సులతో , సుఖ సంతోషాలతో జరగాలని ఆకాంక్షించారు.

## వాసుదేవరావు ఆశయ సాధనకు ఉద్యమిద్దాం



- ప్రజల కోసం పోరాడిన మహనీయుల జ్ఞాపకార్థం నివాళులు
- కళ, పోరాట స్ఫూర్తికి ప్రతీకలు పైలా వాసుదేవరావు, కానూరి తాత

**మహబూబాబాద్ , విశాలభారతి:** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కార్యాలయంలో విప్లవ నాయకులు కామ్రేడ్ పైలా వాసుదేవరావు 16వ వర్ధంతి, అరుణోదయ వ్యవస్థాపకులు కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు (తాత) 11వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కార్యక్రమం ప్రారంభంలో నాయకుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా మాట్లాడుతూ, శ్రీకాకుళం గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన పైలా వాసుదేవరావు పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ ప్రజల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేసిన ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు (తాత) గురించి మాట్లాడుతూ, ప్రజా సాంస్కృతిక రంగంలో ఆయన చేసిన సేవలు అపూర్వమని తెలిపారు. తన కలం, గళం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప కవి, రచయితగా ఆయన నిలిచారని చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో కళా ప్రదర్శనలు, పాటలు, నాటకాల ద్వారా ప్రజలలో అవగాహన పెంచి ఉద్యమాలకు బలం చేకూర్చారని వివరించారు. కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసమే అన్న భావనతో వందలాది కళాకారులను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిగా ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సనప పొమ్మయ్య మాట్లాడుతూ, పైలా వాసుదేవరావు, కానూరి వెంకటేశ్వరరావు (తాత)ల త్యాగాలు, పట్టుదల నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ఆశయ సాధన కోసం ఉద్యమాలు మరింత బలంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత, రాష్ట్ర నాయకురాలు భాగ్యలక్ష్మి, పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర నాయకుడు బానోత్ దేవేందర్ పివైఎల్ నాయకుడు గుగులోతు గణేష్, ఏఐకేఎంఎస్ నాయకుడు దేవరపల్లి నర్సిరెడ్డి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో సమానత్వ సందేశం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్‌పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే గారి 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు సమర్పిస్తూ, అక్కడికి విచ్చేసిన వారందరికీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే ఒక మహనీయ సంఘసంస్కర్తగా, సామాజిక సమానత్వం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడి సమ సమాజ స్థాపనకు పునాది వేసిన మహోన్నత వ్యక్తిగా ఆయన సేవలను గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ పూలే ఆశయాలు, సిద్ధాంతాలను అనుసరించి ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కే హరినాథ్, మహిళా అధ్యక్షురాలు కే సుజాత, రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ డి మాలతి, రాజేంద్రనగర్ మండల మహిళా అధ్యక్షురాలు మాధవి, చంద్రయాన్‌గుట్ట సర్కిల్ మహిళా అధ్యక్షురాలు లావణ్య, ఉపాధ్యక్షురాలు శిరీష, అరుణ, డి ప్రసాద్, చేకూరి అనిల్, జై భీమ్ అసోసియేషన్ అధ్యక్షుడు గోల్కొండ రాజు, జనరల్ సెక్రటరీ ఎడ్లకాడి సూర్యం, తలారి చిన్న రమేష్, అమర్ రెడ్డి, శంకర్ రెడ్డి తదితర దళిత బహుజన నాయకులు, స్థానిక కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**దేవరుప్పల, విశాలభారతి:** కామారెడ్డిగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ చింత రవితో కలిసి ప్రారంభించిన కొడకండ్ల మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నల్ల ఆండాలు. ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట పండించి కొనుగోలు కేంద్రాలలోకి తీసుకువస్తున్నారు కావున బార్ధాన్ సరైన సమయంలో అందించి రైస్ మిల్లర్ల నుండి ఇలాంటి సమస్యలు తలెత్తకుండా సమన్వయం చేయాలని,రాబోయే రోజుల్లో ఈదురుగాలతో కూడిన వడగండ్ల వర్షాలు కురిసే అవకాశాలున్నాయని,ధాన్యం కొనుగోలు విషయంలో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధించిన అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తానని,రైతులకు, రైస్ మిల్లర్లతో సమన్వయ పరుస్తూ సకాలంలో రైతులందరి ధాన్యం కొనుగోలు చేసేటట్టుగా ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పులిపంపుల మమత,ఉప సర్పంచ్ పులిపంపుల భాస్కర్,వార్డు సభ్యులు ఎల్లబోయిన గిరియాదవ్,చింత లక్ష్మయ్య,లింగాల హరీష్,మరాఠీ నర్సమ్మ, ఐకెపి ఎపిఎం,పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రిజ్వాన్ సిరాజ్,సిసి సోమనారాయణ, సిఎ లు మహ్మద్ ఫాతిమా,సెంటర్ నిర్వహణ మహిళ సంఘం ప్రతినిధులు మరాఠీ విమల,చెప్పాల పద్మ,చింత పద్మ, చింత సమ్మక్క,మాజీ ఎంపిటిసి మహమ్మద్ జాకీర్,నాయకులు,గ్రామ రైతులు బిల్ల యాదవరెడ్డి, మొలుగురి యాకయ్య,నారెడ్డి నరసింహ రెడ్డి,తాళ్ళపెల్లి మహేష్, మారేపెల్లి మురళి, పులిపంపుల సురేష్,ఓడపల్లి పుల్లయ్య,కంచర్ల ఉప్పలయ్య,బేజాటి సోమయ్య,చింత యాదగిరి,కంచర్ల మల్లేష్, కట్ల.రమణ రెడ్డి,మహమ్మద్ మౌలానా, పాషా,చింత నర్సయ్య,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



## మజీద్ ఏ నూర్ కొత్త కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ జాకీర్ హుస్సేన్



**దేవరుప్పుల, విశాలభారతి:** దేవర్పుల మండలం కామారెడ్డి గ్రామంలోని మజీద్ ఏ నూర్ కు నూతన కమిటీని గ్రామ ముస్లింలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మహమ్మద్ జాకీర్ హుస్సేన్ ఉపాధ్యక్షులుగా మహమ్మద్ షబ్బీర్ ఎన్నికయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మసీదు ఏ నూర్ మసీదులు ముస్లింలకు ప్రార్ధనలు ఆధ్యాత్మిక ప్రశాంతత ఇస్లామిక్ బోధనలకు కేంద్రాలుగా నిలుస్తున్నాయి ఇదే స్ఫూర్తితో కామారెడ్డి గూడెం మసీదులో కొత్త బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి గ్రామ ముస్లింలు శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో మహమ్మద్ రసూల్, ఇస్మాయిల్, యాకూబ్ పాష, గోరిమియా, పాష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



**చౌటుప్పల్, విశాలభారతి:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, స్త్రీ విద్యకు ఆద్యుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శనివారం పురపాలక కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమాజంలోని అసమానతలను తొలగించి, వెనుకబడిన వర్గాలకు విద్యాఫలాలు అందేలా పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కొత్తపల్లి జైపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బాటసింగారం రైతు సహకార సంఘం మాజీ ఛైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి స్థానికంగా ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రజాదరణ పొందిన నాయకుడిగా, నిత్య శ్రామికుడిగా పేరుగాంచిన జైపాల్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు జరిపారు. ముఖ్య అతిథులు పెద్ద అంబర్‌పేట మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే జైపాల్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. వీరంతా జైపాల్ రెడ్డికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పాడి జంగయ్య గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్,కుంట్లూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ లాల్ మహమ్మద్, యువజన కాంగ్రెస్ నాయకులు మణికిరణ్, కొత్తపల్లి సంతోష్ రెడ్డి, వాసు, కిరణ్ గౌడ్ తో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జాంబవ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, యువకవి-రచయిత బైరపాక స్వామి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఉన్న సామాజిక రుగ్మతలను తొలగించేందుకు పోరాడిన గొప్ప మానవతావాది పూలే అని కొనియాడారు.మహిళా విద్య కోసం అగ్రవర్ణాల వ్యతిరేకతను ఎదుర్కొంటూ ధైర్యంగా పోరాడిన సంస్కర్తగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు.భవిష్యత్తులో బహుజనులు తమ హక్కులను కాపాడుకుంటూ రాజ్యాధికార సాధన వైపు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జాంబవ హక్కుల సాధన సమితి రాష్ట్ర కోశాధికారి ఏలూరి ప్రవీణ్ జాంబవ్, సభ్యులు బైరపాక యాదగిరి జాంబవ్, చాడ నరసింహులు, కందుల మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

## భద్రూ తండాలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**సర్పంచ్ మాలోతు రమేష్ నాయక్**



**కురవి, విశాలభారతి:** కురవి మండలంలోని ఎలకచెట్టు తండా గ్రామపంచాయతీ పరిధిలోని భద్రూ తండాలో ఎంపీపీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను నేడు సర్పంచ్ మాలోతు రమేష్ నాయక్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా, వర్షాకాలంలో ఇబ్బందులు తొలగేలా సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు కూడా దశలవారీగా చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్, ఉప సర్పంచ్ గుగులోతు వీరన్న, వార్డు సభ్యులు బాదావత్ నరేష్, భూక్య రమాదేవి, గ్రామ కార్యదర్శి సురేష్, నాయకులు భద్రూ, సేటు, వెంకన్న, సోషల్ మీడియా అధ్యక్షుడు భూక్య మల్చూర్, జాటోతు కిషన్, జాటోతు భద్రూ, వీరన్న, భీమా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్, విశాలభారతి:** మొక్కజొన్న రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అన్నారు. శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీని కలెక్టర్ సందర్శించారు, మార్కెట్ కు వచ్చిన మొక్కజొన్న లను వెంట వెంటనే కొనుగోలు చేసి తరలించాలని, రైతుకు సంబంధించి వివరాలను మార్క్ఫెడ్ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు, మార్కెట్లో అంతర్గత సిబ్బందిని హమాలీలను పెంచుకొని కాంటాలను చేసి లోడింగ్ చేయాలని, అవసరం ఉన్న చోట మక్కల కొనుగోళ్ల కేంద్రాలకు ప్రతిపాదనలు వెంటనే పంపాలని సూచించారు, ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారని సరిత, స్థానిక తహసిల్దార్ జి. వివేక్, ఎంపీడీవో, మార్కెట్ కమిటీ సెక్రటరీ మార్క్ హెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**మోత్కూరు, విశాలభారతి:** మండలంలోని రైతులు పండించిన వరి ధాన్యాన్ని కల్లాలల్లో అరబోసి గత 15 రోజులుగా కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేపట్టాలని సిపిఎంమండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు.శనివారం మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలోని దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆపార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రైతులు కోతలు పూర్తిచేసుకొని ధాన్యాన్ని కల్లాలల్లో పోసి కొనుగోలు కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యం చేయడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మండలంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 2389 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.1500 నుంచి 1600 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అన్నారు..దీనికి తోడు అదనంగా హమాలీ చార్జీల పేరిట రూ.100 వరకు కోత విధించడంతో రైతులకు కేవలం రూ.1400 నుంచి 1500 మాత్రమే అందుతున్నాయని అన్నారు..రైతులు దోపిడీకి గురికాకుండా ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే గ్రామాలల్లో సహకార సంఘాలు, ఐకేపీ కేంద్రాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి, మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వెంకటనర్సు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, గ్రామశాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సైదులు, రైతులు ముక్కాముల మత్స్యగిరి, బద్దం లక్ష్మా రెడ్డి, ముక్కాముల శ్రీశైలం,ముక్కాముల రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

**కటకం నర్సింగ్ రావు**



**విశాలభారతి,అబ్దుల్లాపూర్మెట్ :** మన ఆలోచన సాధన సమితి (మాస్) ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరై, పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నర్సింగ్ రావు మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, మహిళా విద్య మరియు అభ్యున్నతి కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పూస నరసింహ, దేవేందర్ జి, ఆవుల వెంకట్ యాదవ్, మంగిలిపల్లి శంకర్, పెద్దవూర బ్రహ్మయ్య, బొబ్బిలి రామచందర్ గౌడ్, దువ్వాల శ్రీకాంత్, కవిత తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# ఛాలెంజర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

**ప్రీ-ప్రైమరీ విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు**




**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ లోని ఛాలెంజర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ షా గుప్తా పర్వీన్ ఆధ్వర్యంలో జరిగింది.16 సంవత్సరాలుగా విద్యా రంగంలో ముందంజలో ఉన్న ఈ పాఠశాల నర్సరీ నుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తోంది. ఉపాధ్యాయులు, లెక్చరర్లు విద్యార్థుల్లో సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంలో కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సయ్యద్ అన్వర్ హుల్ పాల్గొనగా, గౌరవ అతిథులుగా మునిసిపల్ చైర్పర్సన్ సోనియా దర్శన్, కౌన్సిలర్ షేక్ వాజిద్, సయ్యద్ అనిసుద్దీన్ ఇవేతాకారుద్దీన్ గౌరి, వలి మొహమ్మద్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులు గౌన్లు, టోపీలు ధరించి పట్టాలు అందుకున్న తీరు ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను మెప్పించాయి. ముఖ్య అతిథులు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అతిథులు ప్రశంసించారు. తమ పిల్లల విజయాన్ని చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# జ్యోతిరావు పూలేకు 'మహాత్మ' బిరుదు

**ఆందోజు రవీంద్ర చారి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** సామాజిక సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలేకు 'మహాత్మ' అనే బిరుదును ప్రజలే అందించారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 2లోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ.. కుల వ్యవస్థ నిర్మూలన, అంటరానితనం నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. మహిళా సాధికారత, స్త్రీపురుష సమానత్వం కోసం ఆయన చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. తన భార్య సావిత్రిబాయి పూలేను దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప దూరదృష్టి నాయకుడని కొనియాడారు. బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాలాన్ని వ్యతిరేకిస్తూ సమానత్వ సమాజ నిర్మాణం కోసం పూలే చేసిన పోరాటం నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. ఆయన ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, నాయకులు అరుణ, శేఖర్, పొన్నాల యాదగిరి, నర్సింహా, మధు, వినోద్ నాయక్, ఈశ్వరయ్య, నిరంజన్, సైదులు ముదిరాజ్, ఆటో రాములు, చిర్రా కవిత, సుజాత, వీరేష్, కొత్తూరు సుభద్ర, మహేందర్, అచ్చు నారాయణ, కారంపూడి వెంకటయ్య, అశోక్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నపాక పద్మ శ్రీనివాస్‌కు ఘన సత్కారం

**బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సేవలకు గుర్తింపు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సమాజ సేవలో విశిష్ట కృషి చేసిన చిన్నపాక పద్మ శ్రీనివాస్‌కు "దళిత రత్న అవార్డు" లభించిన సందర్భంగా పసుమముల గ్రామం శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పేదలు, అనాథ పిల్లల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న శ్రీనివాస్ సేవలను అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. సన్మానం అనంతరం చిన్నపాక పద్మ శ్రీనివాస్ మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి తాను చేస్తున్న సేవలు మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చైతన్య, ప్రధాన కార్యదర్శి యాఖుబ్ పాషా, ట్రెజరర్ అరవింద్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, కల్చరల్ సెక్రెటరీ శ్రీకాంత్ గౌడ్, కమిటీ సభ్యులు రామకృష్ణ,వెంకటరమణ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓయూకు మూడు బస్సులు విరాళం

**ఎస్బీఐని అభినందించిన ఓయూ వీసీ**

**ముషీరాబాద్,విశాలభారతి:**




విద్యార్థుల రవాణా అవసరాల కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడు బస్సులను విరాళంగా అందజేసింది. ఈ మేరకు బస్సుల తాళాలను ఎస్బిఐ అధికారులు ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం కు అందజేశారు. సుమారు కోటి రూపాయల విలువైన ఈ విరాళం విశ్వవిద్యాలయ రవాణా సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరచనుంది. రెండు సాధారణ బస్సులతో పాటు ఓ ఏసీ బస్సు కూడా ఎస్బిఐ అధికారులు ఓయూ కు అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ.. ఓయూ విద్యార్థుల పట్ల భారతీయ స్టేట్ బ్యాంక్ అంకిత భావాన్ని ప్రశంసించారు. కోటి రూపాయల వ్యయంతో ఇచ్చిన మూడు బస్సులు కేవలం రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచటమే కాకుండా.. విద్యార్థుల విద్యా ప్రయాణానికి వెన్నుదన్నుగా నిలుస్తుందని కొనియాడారు. ప్రతిభకు నిలయమైన ఉస్మానియా వంటి విశ్వవిద్యాలయానికి, దేశంలోని అతిపెద్ద బ్యాంక్ అండగా నిలవడం భావితరాల నిర్మాణానికి ఎంతో తోడ్పడుతుందని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఈ సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రధాన అధికారి ఎస్.రాధాకృష్ణన్ మాట్లాడుతూ 219 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన స్టేట్ బ్యాంక్, 109 ఏళ్ల అద్భుత విద్యా వారసత్వం కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం కలిసి పని చేయటం చారిత్రాత్మకమని అన్నారు. ఈ అవకాశం తమకు దక్కిన గొప్ప గౌరవంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితెంద్ర కుమార్ నాయక్, ప్రొఫెసర్ రాజశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ సి. కాశీం... ఎస్బిఐ అధికారులు గణపతి, పంకజ్ ప్రియదర్శి, రోహిత్ కుమార్, కొండ రవి శేఖర్, తంగి గణపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచే ఏకైక శక్తి కమ్యూనిస్టు పార్టీ

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- సిపిఐలో చేరిన 80 కుటుంబాలు



**పాల్వంచ విశాల భారతి:**

ప్రజల పక్షాన నిలిచే ఏకైక శక్తి కమ్యూనిస్టు పార్టీ అని, సిపిఐ నిర్వహిస్తున్న పోరాటాలకు ఆకర్షితులై ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ (6వ డివిజన్) లో వీ రామకృష్ణ(టెంట్ హౌస్ రామకృష్ణ), సయ్యద్ యాకుబ్ (అమీర్) నేతృత్వంలో సీపీఐ ప్రజా సంఘాలలో 80 కుటుంబాలు చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చేరికల సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సాబీర్ పాషా పార్టీ కండువాలు కాపీ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే సిపిఐ జానాధారణ పొందుతుందని అన్నారు. ప్రజల పక్షాన నిబద్ధతతో పోరాడే సిపిఐని మరింత బలోపేతం చేసుకోవాలని అన్నారు. పాల్వంచ బస్తీల అభివృద్ధి సిపిఐ తోనే సాధ్యంనీ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలపై పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరుతున్నవారు సిపిఐ, అనుబంధ ప్రజాసంఘాల బాధ్యతలు తీసుకొని ప్రజా సమస్యల పరిష్కరంకోసం కృషి చేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అవసరమైతే పోరాటాలు నిర్వహించాలని సూచించారు. కార్యకర్తలు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ సేవలందించే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని, సిపిఐ సేవలను గుర్తించి ఇటీవల వందలాదిమంది వివిధ పార్టీల నుంచి సిపిఐలో చేరారని, వారి నమ్మకానికి అనుగుణంగా సమస్యల పరిస్కారంకోసం కృషిచేస్తామని అన్నారు. ప్రజా సమస్యల పరిస్కారమే సిపిఐ ఏకైక అజెండా అని అందుకోసం ఎలాంటి త్యాగానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. స్థానిక శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్వంచ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చూపిస్తున్నారని, మరింత అభివృద్ధి చేసుకోవటానికి ప్రత్యేక గ్రాంట్లు కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారని తలిపారు. గత 30 సం.లుగా ఎన్నికలు లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పాల్వంచను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చారిత్రక కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించిన ఘనత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం మేయర్ మూడ్ గణేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వర రావు, జిల్లా సమితి సభ్యులు ఎండీ నజీర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు ఇట్టి వెంకట్రావు, నాయకులు ys గిరి, అంబడిపూడి నరేంద్ర, బోడ రాజు, నాగేశ్వరరావు, రవి, యాకేష్, షఫీ, చాంద్ బి, బాబురావు, యాకూబ్, ముంతాజ్, నరేష్, మదర్, రామాచారి, కృష్ణ, వెంకన్న, రాములు, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరి కుంట, బాతుల చెరువుల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్

**జోనల్ కమిషనర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించిన గజ్జి భాస్కర్ యాదవ్**

**విశాలభారతి,అబ్దుల్లాపూర్మెట్:**



ఉమ్మడి హయత్ నగర్ పరిధిలోని కుమ్మరి కుంట, బాతుల చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనులకు త్వరలోనే మోక్షం కలగనుంది. స్థానిక ప్రజల చిరకాల కోరిక మేరకు ఈ చెరువుల అభివృద్ధిపై అధికారులు సానుకూల నిర్ణయం తీసుకున్నారు. శనివారం టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ ఇంచార్జ్ శ్రీ మధు యాష్కి గౌడ్ మార్గదర్శకత్వంలో, రాష్ట్ర కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణలతో కలిసి కుమ్మరి కుంట, బాతుల చెరువు ప్రాంతాలను పరిశీలించారు. కుమ్మరి కుంట కట్టపై రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగించాలని అధికారులను కోరారు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' అందిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు. బాతుల చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా,ఆధునిక వాకింగ్ ట్రాక్ నిర్మాణం,ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా పార్కు అభివృద్ధి,చెరువు చుట్టూ లైటింగ్ మరియు పచ్చదనం. ఈ పనుల ద్వారా స్థానికులకు మెరుగైన మౌలిక సదుపాయాలతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని గజ్జి భాస్కర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ డిసి ,ఎస్ఈ, ఈఈ,ఆర్ఐ , సర్వేయర్లు మరియు కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక విప్లవ పితామహుడు మహాత్మజ్యోతిరావు పూలే

**ఘనంగా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు**

**భద్రాచలం, విశాలభారతి:**

స్థానిక సరోజినీ వృద్ధాశ్రమం నందు షెడ్యూల్ క్యాస్ట్ జేఏసీ భద్రాచలం వారి ఆధ్వర్యంలో సామాజిక విప్లవకారులు మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా వృద్ధుల తో కేక్ కటింగ్ చేసి రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి సభాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది అవులూరి సత్యనారాయణ అధ్యక్షత వహించడం జరిగింది. ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి తొలితరం తెలంగాణ ఉద్యమకారులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ తిప్పన సిద్ధులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం షెడ్యూల్ క్యాస్ట్ జేఏసీ నాయకులు అవులూరి సత్యనారాయణ, పడిసిరి శ్రీనివాస్, తిప్పన సిద్ధులు మాట్లాడుతూ... చరిత్రలో దాచబడ్డ దాగని సత్యం మహాత్మ జ్యోతిరావు పూలే.ఈ రోజు మనం ఈ స్థితిలో ఉన్నాం అంటే దానికి ముఖ్య కారణం ఆ రోజు పూలే దంపతుల త్యాగమే అని వారు అన్నారు. ముఖ్యంగా మహిళలకు చదువుకునే భాగ్యం ఆ దంపతుల కృషే అని ఈ రోజు మన పిల్లలకు వసతిగృహాలు మరియు ఉచిత విద్యలకు ఆద్యులు మన పూలే దంపతులే అని కొనియాడారు. చరిత్రలో ఇప్పటి వరకూ ఆదర్శ దంపతులేవరంటే ఆ స్థానంలో మొదటిగా పూలే దంపతులే ఉంటారాని, ప్రపంచ మేధావి బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మొదటి గురువు మహాత్మ జ్యోతిరావు పూలే అని సగౌరవంగ చెప్పుకున్నారని గుర్తు చేశారు.బహుశా బాబాసాహెబ్ చెప్పిన "త్యాగం మరింత త్యాగం" అనే సూక్తి ఈ దంపతులను చూసే మనకందించుంటాడు అని అన్నారు.మనమంత కొత్తగా ప్రయోగాలు చేసేది ఏమీలేదని కేవలం ఆ మహనీయులు చూపిన దారిని ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ క్యాస్ట్ జేఏసీ నాయకులు అల్లాడి పౌల్ రాజ్, గద్దం సుధాకర్, అలవాల రాజా పెరియార్, తూరపాటి కోటయ్య, కొగిల గాంధీ, అనాధ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు సరోజినీ పాల్గొన్నారు.



# ఘనంగా జైపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పెద్ద అంబర్పేట్ డివిజన్ పసుమముల గ్రామం శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బాటసింగారం రైతు సహకార సంఘం మాజీ ఛైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డిని పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి అసోసియేషన్ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడిగా జైపాల్ రెడ్డి మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చైతన్య, ప్రధాన కార్యదర్శి యాఖుబ్ పాషా, ట్రెజరర్ అరవింద్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, కల్చరల్ సెక్రెటరీ శ్రీకాంత్ గౌడ్, కమిటీ సభ్యులు వెంకటరమణ, పి. రామకృష్ణతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబా పూలే గొప్ప సంఘసంస్కర్త

**టీ.యస్ బహుజన ఐక్య వేదిక**



**పాల్వంచ విశాలభారతి:** అణగారిన జీవితాల్లో విద్య ద్వారా వెలుగులు నింపిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే అని వక్తలు కొనియాడారు. తెలంగాణా బహుజన ఐక్య వేదిక అధ్యక్షులు శ్రీపాద సత్యనారాయణ అధ్యక్షతన పూలే 200 జన్మదిన వేడుకలను శనివారం పాల్వంచ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అవిద్యే శూద్రుల జీవితాల్లో అభివృద్ధి నిరోధకమని భావించిన పూలే ఒక వర్గానికే విద్య అందుతుందని తెలిసి నిమ్న జాతులకు పాఠశాలలు తెరిచి విద్యను అందించిన గొప్ప వ్యక్తి పూలే అని అన్నారు. రాజుల పరిపాలన కాలంలో అట్టడుగు వర్గాలను చిన్న చూపు చూసి ఊరికి దూరంగా వుంచి అంటరానివారిగా చూసిన కాలంలో, మూఢనమ్మకాలను, అవిద్యను, సాంఘిక దురాచారాలను పారద్రోలుటకు పూలే, సావిత్రి బాయి పూలే కంకణం కట్టుకొని రూపుమాపిన తీరును కూలంకషంగా విశిదీకరించారు. మహారాష్ట్ర పూనే లో నేటికి పూలే వాడ పేరు మీద ఆయన నివాసం, నడిపిన పాఠశాల, ఆయన సమాధి వున్నాయని అంబేద్కరిస్టులు, పూలే వాదులు తప్పక జీవితంలో వాటని ఒకసారి సందర్శించాలని తెలియచేసారు.పూలే, అంబేద్కర్ భావ జాలాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ముఖ్యంగా విద్యార్థులకు వీరి జీవితాలను తెలిపే ఘట్టాలను పాఠ్యాంశంలో చేర్చాలని కోరారు. ముందుగా చిత్రపటానికి పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరగడి దేవదానం, సెక్రటరి శనగ రామచందర్ రావు, చిటికెన ముసలయ్య, షేక్ నబీ సాహెబ్,శనగ వెంకటేశ్వర్లు, మంజూర్,కుడికాల ఆంజనేయులు, జగన్ మోహన్ రావు, గొడ్ల మోహన్ రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# పూలే చూపిన మార్గంలో నడవాలని పిలుపు

- పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు
- అణగారిన వర్గాల అభివృద్ధికి పూలే కృషి గుర్తింపు
- యువత సామాజిక మార్పుకు ముందుకు రావాలని సూచన





**సత్తుపల్లి, విశాలభారతి :** మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, పూలే సమాజంలో అణగారిన వర్గాల అభివృద్ధికి, విద్యా విస్తరణకు చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. మహిళా విద్యకు, సమాన హక్కులకు ఆయన చేసిన పోరాటం నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.విద్యా సమానత్వం, సామాజిక న్యాయం కోసం పూలే చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత పూలే ఆలోచనలను అర్థం చేసుకుని సమాజ మార్పుకు కృషి చేయాలని సూచించారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**అబ్దుల్లాపూర్మెట్ గ్రామ వార్డు సభ్యులు మొగుళ్ల జీవన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి నివాసంలో పలువురు పార్టీ శ్రేణులు, అభిమానులు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని వారి నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇబ్రహీంపట్నం యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, అబ్దుల్లాపూర్ మెట్ వార్డు సభ్యులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి మరియు అబ్దుల్లాపూర్ మెట్ మండల యువజన విభాగం అధ్యక్షులు మొగుళ్ళ వినయ్ రెడ్డి మంచిరెడ్డిని ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీవన్ కుమార్ రెడ్డి, వినయ్ రెడ్డిలతో పాటు యువ నాయకులు దొండ వినోద్ రెడ్డి, అఖిల్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొని కిషన్ రెడ్డి గారికి పుట్టినరోజు అభినందనలు తెలిపారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి గారు నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజా సేవలో మరిన్ని విజయాలు అందుకోవాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు మంచిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో ఇబ్రహీంపట్నం పరిసరాల్లో సందడి నెలకొంది.

హైదరాబాద్, విశాలాభారతి : భాగ్యనగరం నేడు కేవలం ఒక రాష్ట్ర రాజధాని మాత్రమే కాదు, అంతర్జాతీయ పెట్టుబడులకు చిరునామాగా మారింది. దశాబ్ద కాలం క్రితం హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలకే పరిమితమైన అభివృద్ధి నేడు 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును దాటుకుని అంచెలంచెలుగా విస్తరిస్తోంది. రాబోయే రోజుల్లో రీజినల్ రింగ్ రోడ్డు (RRR), ప్రతిపాదిత బుల్లెట్ రైలు హబ్‌లు నగర రూపురేఖలను సమూలంగా మార్చేయనున్నాయి. ఈ మౌలిక సదుపాయాల కల్పన రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త విప్లవాన్ని తీసుకువస్తోంది. కేవలం నివాస ప్రాంతాలే కాకుండా, అంతర్జాతీయ స్థాయి బిజినెస్ హబ్‌లకు హైదరాబాద్ వేదికగా నిలుస్తోంది.

# ముచ్చటగా మూడో వలయం..

## విశ్వనగరంగా భాగ్యనగరం

### ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ దాకా.. బుల్లెట్ హబ్

### వేగంతో మారనున్న భూముల విలువలు

ఔటర్ రింగ్ రోడ్డు (ORR) నేడు హైదరాబాద్ ఆర్థిక రంగానికి జీవనాడిలా మారింది. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని కోకాపేట, నార్సింగి, తెల్లాపూర్ వంటి ప్రాంతాల్లో భూముల ధరలు రికార్డు స్థాయికి చేరడానికి ఈ రోడ్డే ప్రధాన కారణం. కోకాపేటలో ఇటీవల జరిగిన వేలంలో ఎకరం భూమి ధర వంద కోట్ల రూపాయల మార్కును దాటడం గమనార్హం. ఇక్కడ నిర్మిస్తున్న నియోపోలిస్ వంటి ప్రాజెక్టులు అంతర్జాతీయ కంపెనీలకు నిలయంగా మారుతున్నాయి. ఐటి ఉద్యోగుల తాకిడి పెరగడంతో అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణం జోరందుకుంది. ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న గ్రీన్ బెల్ట్ మరియు సర్వీస్ రోడ్ల అనుసంధానం వల్ల రవాణా సౌలభ్యం పెరిగి, శివారు ప్రాంతాలు సైతం విలాసవంతమైన నివాసాలుగా రూపాంతరం చెందుతున్నాయి.

### బుల్లెట్ రైలు హబ్.. మారనున్న ముఖచిత్రం..

హైదరాబాద్‌ను ముంబై, బెంగళూరు నగరాలతో అనుసంధానించే హై-స్పీడ్ రైలు (బుల్లెట్ రైలు) ప్రాజెక్టు రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత కీలకమైన అంశంగా మారబోతోంది. శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో ఈ బుల్లెట్ రైలు హబ్ ఏర్పాటు కానున్నట్లు ప్రాథమిక అంచనా. ఒకవేళ ఇది కార్యరూపం దాల్చితే, దక్షిణ హైదరాబాద్ ప్రాంతం దేశంలోనే అతిపెద్ద మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా అవతరిస్తుంది. కేవలం మూడు గంటల్లో ముంబైకి చేరుకునే సౌకర్యం కలగడం వల్ల, వాణిజ్య సముదాయాలు, స్టార్ హోటళ్లు, గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి ఇక్కడ భారీ డిమాండ్ ఏర్పడుతుంది. ఇది తుక్కుగూడ, మహేశ్వరం వంటి ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు తొడిగే అవకాశం ఉంది.




### రీజినల్ రింగ్ రోడ్డు... రియాలిటీ డెస్టినేషన్:

నగరంపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు (RRR) ప్రాజెక్టు రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త ఆశలు చిగురింపజేస్తోంది. సుమారు 340 కిలోమీటర్ల పొడవున, నగరం నుంచి 30 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో నిర్మితమవుతున్న ఈ రోడ్డు వల్ల చౌటుప్పల్, సంగారెడ్డి, గజ్వేల్, భువనగిరి వంటి ప్రాంతాలు శాటిలైట్ సిటీలుగా మారనున్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల వందలాది గ్రామాలకు మెరుగైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. చిన్న, మధ్యతరగతి పెట్టుబడిదారులు ఇప్పుడు ఆర్ఆర్ఆర్ ఇంటర్‌ఛేంజ్ పాయింట్ల వద్ద భూములు కొనేందుకు మొగ్గు చూపుతున్నారు. భవిష్యత్తులో ఈ రోడ్డు వెంబడి లాజిస్టిక్ పార్కులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కానున్నాయి, ఇది స్థానికంగా ఉపాధిని పెంచడమే కాకుండా భూముల విలువను రెట్టింపు చేసే అవకాశం ఉంది.

### వికేంద్రీకరణతో నలుదిశల అభివృద్ధి

ప్రభుత్వ 'లుక్ ఈస్ట్' పాలసీ ద్వారా ఉప్పల్, పోచారం, ఘటకేసర్ వంటి ప్రాంతాల్లో ఐటి రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీనివల్ల పశ్చిమ హైదరాబాద్‌పై ఉన్న రద్దీ తగ్గి, నగరం తూర్పు వైపుకు విస్తరిస్తోంది. ఉత్తరాన కొంపల్లి, మేడ్చల్ ప్రాంతాలు పారిశ్రామిక, గృహ నిర్మాణ రంగాల్లో వేగంగా దూసుకుపోతున్నాయి. దక్షిణాన ఫార్మా సిటీ, ఏరోస్పేస్ పార్కుల వల్ల ఆ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. మొత్తంగా చూస్తే, ఓఆర్ఆర్ పటిష్టత, ఆర్ఆర్ఆర్ రాక, బుల్లెట్ రైలు కనెక్టివిటీ.. ఈ మూడు అంశాలు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగాన్ని వచ్చే రెండు దశాబ్దాల పాటు వెనక్కి తిరిగి చూసుకోకుండా చేస్తాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. నూతన బిజినెస్ హబ్‌ల ఏర్పాటుతో హైదరాబాద్ గ్లోబల్ సిటీల జాబితాలో అగ్రస్థానంలో నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.



# కీసరలో డేకాయిటీ గ్యాంగ్ అరెస్టు

**ఆరుగురు నిందితులను రిమాండ్**

**కీసర,విశాలభారతి :** కీసర పోలీస్ స్టేషన్లో శనివారం మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం బాధితుడుపై దాడి చేసి 15 గ్రాముల గోల్డ్ , షిఫ్ట్ కార్ , ఆరు సెల్ఫోన్లో, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు.బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నాలుగు రోజుల్లో కేసులు చేదించారు. ఏడుగురు నిందితుల్లో ఒకరు తప్పించుకోగా ఆరుగురుని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు.గతంలో అబ్దుల్లాపూర్మెట్ ఘట్కేసర్ , కీసర పలు దొంగతనాలు చేసినట్టు తెలిపారు. నిందితులు 1. కుసుమ కార్తీక్, 2 రామ్ రాజా , 3. బబ్లు సింగ్, 4. కందుల సాయి తేజ,5. గండ్ల శ్రావణ్, 6. మాచర్ల పవన్ కళ్యాణ్, 7 చెన్నకేశవుల పవన్ కళ్యాణ్ పరారీ పరారీలో ఉన్నాడు. అందరూ వరంగల్ ప్రాంతానికి చెందినవార. Grinder app gay ఆప్ ద్వారా పరిచయం చేసుకొని గేలను టార్గెట్ చేస్తూ వారిని దోచుకుంటున్నారు.వారిని వీడియోలు ఫోటోలు తీస్తూ బ్లాక్మెయిల్ చేస్తూ వారి వద్ద ఉన్న సొత్తును దోచుకుంటూ బ్లాక్మెయిల్ కు పాల్పడుతున్నారు.సోషల్ మీడియా ప్రైవేట్ యాప్ మోజులో పడద్దని యువత అప్రమత్తంగా ఉండాలని డిసిపి సిహెచ్ శ్రీధర్ సూచించారు.ఈ సందర్భంగా కేసును త్వరగా చేధించిన కీసర పోలీసులను అభినందించారు.ఈ ప్రెస్ మీట్ లో ఏసిపి చక్రవర్తి,కీసర సి ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి ఓ చరిత్రహీనుడు

**భవిష్యత్తు లేని నాయకుడు 'ఫ్యూచర్ సిటీ' కడతాడా.. కేటీఆర్ ధ్వజం**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. పేదల భూములను గుంజుకుంటున్న రేవంత్ రెడ్డి, చరిత్రలో ఒక 'చరిత్రహీనుడిగా' మిగిలిపోతారని విమర్శించారు. శనివారం రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బొంగ్లూర్ లోని ప్రమిద గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారం శాశ్వతం కాదు.. ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారు" అని హెచ్చరించారు. 50 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి



రాకుండా, రేవంత్ రెడ్డి ఆ పార్టీని పాతాళానికి తొక్కుతారని ఎద్దేవా చేశారు. ఫ్యూచర్ సిటీ ఒక అబద్ధం హైదరాబాద్ అభివృద్ధిపై స్పందిస్తూ, "సొంతంగా భవిష్యత్తు లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతాననడం హాస్యాస్పదం. మేము ఏడేళ్ల పాటు కష్టపడి, అంతర్జాతీయ స్థాయి ఫార్మా సిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరిస్తే.. ఇప్పుడు ఆ భూముల్లో ఫ్యూచర్ సిటీ కడతామని రేవంత్ ప్రభుత్వం చెబుతోంది. ఉన్న నగరాన్ని పట్టించుకోవడం చేతకాని వారు, కొత్తగా నగరాన్ని ఏం నిర్మిస్తారు?" అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులకు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల్లో అడ్డంకులను అధిగమించి విజయం సాధించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు మరియు సర్పంచులను కేటీఆర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నియోజకవర్గ ముఖ్య నేతలు మరియు వేలాది మంది కార్యకర్తలు పాల్గొని సభను దిగ్విజయం చేశారు.

# ఫుట్ పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

శనివారం నార్సింగి సర్కిల్ అధికారులు ఫుట్ పాత్ ఆక్రమణల పై ఉక్కుపాదం మోపుతున్నారు. ఉదయం నుంచే రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 6 గంటల నుంచే మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగారు. సుమారు 10 కిలోమీటర్ల మేర రోడ్లపై ఫుట్ పాత్ లపై ఉన్న ఆక్రమణలను 16 జేసీబీ యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. గుడిసెలు, జిరాక్స్ సెంటర్లు, ఆక్రమణలకు గురైన బస్సు షెల్టర్లను తొలగిస్తున్నారు. లాంకో హిల్స్ జి సర్కిల్ నుంచి ఓయూ కాలనీ వరకు, ఫ్రెండ్స్ కాలనీ నుంచి నార్సింగి వైపునకు వెళ్లే రహదారిలో అలనాటి హోటల్ వరకు, ప్రేరణ ఆసుపత్రి మీదుగా గౌతమ్ మోడల్ స్కూల్, గోల్డెన్ టెంపుల్ సెక్రటేరియట్ కాలనీలో ఉన్న ఆక్రమణలు, ప్రతిభ స్కూల్ నుంచి నెక్నంపూర్ చింతచెట్టు సర్కిల్ వరకు, యోగా సర్కిల్ నుంచి అల్కాపూర్ రోడ్ నెంబర్ 30 వరకు రహదారులపై ఉన్న ఆక్రమణలతో పాటు ఫుట్ పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న వీధి వ్యాపారాలను మున్సిపల్ సిబ్బంది జెసిబిలతో తొలగిస్తున్నారు. మణికొండ ప్రాంతంలో భారీ ఎత్తున ఆక్రమణలు తొలగించడం తీవ్ర చర్చకు దారితీసింది. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్, సీఎంసీ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు, నార్సింగి డిప్యూటీ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, ఏసీపీ మనోహర్, డీఈఈ శివ సాయి, 200 మంది సిబ్బంది పాల్గొన్నారు. కొందరు నేతలకు చెందిన ఆక్రమణలు కూడా అధికారులు తొలగించారు. అతి పెద్ద డ్రైవ్ చేపట్టిన అధికారులు ఆక్రమణలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు."







# అక్కలా సలహాలు ఇస్తుంది

**ఇండస్ట్రీలో హీరోయిన్ల మధ్య స్నేహాలు కామన్‌గానే కనిపిస్తాయి. అయితే, వాటిలోని ఎన్నో స్నేహాలు ఇద్దరూ కలిసి నటించడం వరకే కొనసాగుతాయి. ఆ తర్వాత అటకెక్కుతాయి. కానీ, తమన్నా భాటియాతో తన స్నేహం చిరస్థాయిగా నిలిచేదని అంటున్నది టాలీవుడ్ బ్యూటీ.. మృణాల్ ఠాకూర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్.. తమన్నాతో స్నేహం గురించి చెబుతూ ఎమోషనల్ అయ్యింది. "నేను చిన్నప్పటి నుంచి అబ్బాయిలతోనే ఎక్కువగా ఉండేదాన్ని. అందుకే నాకు అమ్మాయిలతో స్నేహం చేయడం కొంచెం కష్టంగా అనిపించేది. ఇండస్ట్రీలో హీరోయిన్ల మధ్య స్నేహాలు కామన్‌గానే కనిపిస్తాయి. అయితే, వాటిలోని ఎన్నో స్నేహాలు ఇద్దరూ కలిసి నటించడం వరకే కొనసాగుతాయి. ఆ తర్వాత అటకెక్కుతాయి. కానీ, తమన్నా భాటియాతో తన స్నేహం చిరస్థాయిగా నిలిచేదని అంటున్నది టాలీవుడ్ బ్యూటీ.. మృణాల్ ఠాకూర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్.. తమన్నాతో స్నేహం గురించి చెబుతూ ఎమోషనల్ అయ్యింది. "నేను చిన్నప్పటి నుంచి అబ్బాయిలతోనే ఎక్కువగా ఉండేదాన్ని. అందుకే నాకు అమ్మాయిలతో స్నేహం చేయడం కొంచెం కష్టంగా అనిపించేది.**

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.